# ట్రబుల్ మేకర్స్



MVS PUBLICATIONS

మధుబాబు

# ట్రబుల్ మేకర్స్

నిలువెత్తున ఎగిసిపడుతున్న అలలతో అల్లకల్లోలంగా ఉంది అంటార్కిటిక్ మహాసముద్రం. ఆ అలల తాకిడికి మెల్లిగా కదులుతూ వుయ్యాలలూగుతున్నది భారత వాణిజ్య నౌక ఐ.యస్.యస్. కావేరి.

అది సౌత్ ఆఫ్రికా రేవు పట్టణం కల్హారి. అక్కడ నుంచి కొన్ని జనరేటర్లను లోడ్ చేసుకొని ప్రయాణం ప్రారంభించాలి. లంగరు ఎత్తటానికి యింకో నాలుగు గంటలు మాత్రమే వుంది వ్యవధి. లోడింగ్ యింకా పూర్తి కాలేదు.

"బ్లడీ లోడింగ్ ! బ్లడీ జనరేటర్స్! బ్లడీ హార్బర్!!! బ్లడీ... బ్లడీ" గుక్క తిప్పుకోకుండా కంటికి కనిపించిన విషయాన్నల్లా తిట్టి విసుగును ప్రదర్శిస్తున్నాడు కాప్టన్ టోని.

అతని విసుగుకు పెద్ద కారణమే వుంది. సౌత్ ఆఫ్రికాలో రాజకీయ కల్లోలాలు చెలరేగుతున్నాయి. పోలీసుల కాల్పులు టియర్ గాస్ ప్రయోగాలు తప్పటం లేదు. ఆ గోలలో గాయపడి ప్రాణాలు పోగొట్టుకున్నారు నలుగురు ఆస్ట్రేలియా పౌరులు. వారి దేహాలు చెక్కపెట్టెల్లో పెట్టి ఆస్ట్రేలియా పంపుతున్నది సౌత్ ఆఫ్రికన్ ప్రభుత్వం. కల్హారి రేవును వదిలిన తర్వాత సూటిగా ఆస్ట్రేలియా పోతుంది కావేరి. కాప్టెన్

టోనీకి యిష్టం లేకపోయినా, ఆ శవాలున్న చెక్కపెట్టెలు కావేరిలో భద్రపరచబడ్డాయి కారణం నెంబరు వన్ మాత్రమే యిది.

నెంబర్ టూ... కొందరు దేశద్రోహులు అదును చూసి కల్హారీలో వున్న డిఫెన్స్ లేబరేటరీలమీద దాడిచేసి అక్కడ తయారౌతున్న సూపర్ బాంబ్ అనబడే అతిభయంకరమైన బాంబుని, దాన్ని ప్రయోగించటం ఎలాగో తెలిసిన మోర్గాన్ అనబడే సైంటిస్ట్‌ని మాయం చేశారు. వారికోసం తీవ్రమైన గాలింపులు ప్రారంభించారు మిలటరీ అధికారులు. ఎయిర్ పోర్టులను, కారు రూట్లను చెక్ చేసి హార్బర్ మీద విరుచుకుపడ్డారు కావేరీని క్రిందినుంచి పైదాకా గాలించి వదిలారు వారు. వారికి కావాల్సినవేవీ కన్పించలేదు గాని... అనుకున్న టైంకి మూడు రోజులు లేట్‌గా బయలుదేరుతున్నది కావేరి.

అదీ కాప్టన్ టోని కోపానికి అసలు కారణం.

ముఖానికి పట్టిన చెమటలను తుడుచుకుంటూ చుట్టూ చూశాడతను. కూలీలను హెచ్చరిస్తూ, సాధ్యమైనంత త్వరగా లోడింగ్ పూర్తి చేయించాలన్నంత పట్టుదలతో బిజీగా వున్నాడు వైస్ కాప్టన్.

"రాజూ" ఖంగుమన్నది టోనీ కంఠం.

క్రేన్ మీదినుంచి వ్రేలాడుతున్న యినుప గొలుసుల్ని ఒక జనరేటర్‌కి బిగిస్తున్న రాజు తలతిప్పి చూశాడు. ఆ పనిని మరొకరికి వప్పగించి, టోనీ దగ్గరికి వచ్చి శాల్యూట్ చేశాడు.

"వాటీజ్ దిస్ రాజు? ఇలా అయితే మనం వచ్చే నెలలో కూడా యిక్కడే వుంటాం. కాస్త త్వరలో పని పూర్తి చేయించే మార్గం చూడు." మాటలు అన్నంత తేలికగా పని కాదని తెలిసి కూడా కాప్టెన్ హోదా ప్రదర్శించాడు టోనీ.

"యస్ సర్" ముక్తసరిగా సమాధానమిచ్చాడు రాజు. "ఫినిష్ యిట్ సూన్. పని అయిపోగానే నా కాబిన్‌కి రా. కాస్త కాఫీ తాగుదువు గాని." అని వెనుతిరిగాడు టోని.

నవ్వుకుంటూ వర్క్ స్పాట్‌లోకి వచ్చాడు రాజు. అప్పుడే జనరేటర్ ఒకటి గాలిలోకి లేచింది. మోతలు చేస్తున్న క్రేన్ దాన్ని కావేరి మధ్య భాగానికి మళ్లిస్తోంది

ఉన్నట్లుండి జనరేటర్ చివరగా బిగించివున్న గొలుసు జారిపోయింది. వద్దున నిలబడిన కూలీలు అదిరిపడి అలాగే నిలబడిపోయారు. క్షణంలో మిగిలిన గొలుసులు వూడి పోతాయి. అంత ఎత్తు నించిపడితేఅది నాశనం కావటమే కాక షిప్ కూడా పాడై పోతుంది.

"హల్లో రాజు... పొద్దుట నుంచీ కనిపించటమే లేదు..." అంటూ వచ్చి భుజం మీద చెయ్యివేసింది సీమ. కావేరీలో ఒక ప్రయాణీకురాలు ఆమె.

భుజంమీది చేతిని విసిరికొట్టాడు రాజు. చేతులు ఎత్తి క్రేన్ ఆపరేటర్‌కి సైగచేసి విజిల్ వేశాడు.

కావేరి వర్కర్స్ అందరూ కత్తులలాంటి వాళ్ళు. రాజు సైగ అందుకోగానే వెంటనే గేర్ మార్చి శరవేగంతో జనరేటర్ని కిందికి దించాడు క్రేన్ ఆపరేటర్. ఒక యినుప కమ్మీ మీదినుంచి అవతలికి జంప్ చేసి జనరేటర్ దగ్గరికి పరుగుతీశాడు రాజు. భుజాన్ని దానికి ఆనించి గొలుసు జారిపోయిన మూలను క్రిందికి వరగకుండా అడ్డుకున్నాడు

సరిగ్గా మిగిలిన గొలుసులు జారిపోయి, అది తల్లకిందులు కాబోతున్న ఆఖరిక్షణంలో చిన్నకుదుపు యిచ్చి షిప్ మీద దిగింది జనరేటర్. డెక్ కొంచెం సొట్టపడింది. అంతకుమించి పెద్ద డామేజి జరగలేదు.

అందరూ గుండెలమీది నుంచి కొండలు తొలగినంత హాయిగా నిట్టూర్చారు పరుగు పరుగున వచ్చి రాజును చుట్టుముట్టారు

తన కాబిన్ ముందు నిలబడి అంతా గమనిస్తున్న కాప్టెన్ టోనీ మెచ్చుకుంటున్నట్లు తల పంకించాడు.

"బ్లడీ యిడియట్... బ్లడీ యింటిలిజెంట్ అండ్ ఎఫిషియంట్ బగ్గర్ దట్ రాజు" అనుకున్నాడు మనసులో.

ఎప్పుడు సరదాగా మాట్లాడే రాజు తనచేతిని అలా విసిరి కొట్టడంతో కోపగించుకున్నది సీమ. కాని జరిగిన విషయం చూసేసరికి ఆమె కోపం మాయమయింది.

"ఐయామ్ సారీ రాజూ... డిస్టర్బ్ చేశాను కదూ?" అన్నది అదోలా చూస్తూ.

"ఇటీజ్ ఆల్ రైట్... మీ తప్పేమీ లేదు." చెమట తుడుచుకుంటూ సమాధానం ఇచ్చాడు రాజు.

"తప్పు లేకపోవటం ఏమిటి? నాది తప్పే. ప్లీజ్ ఫర్ గివ్ మి." పట్టు పట్టిందిసీమ.

"భగవంతుడా...నాకీ తలనొప్పి ఏమిటిరా?" అని మనసులో దేముణ్ణి తిట్టుకున్నాడు రాజు. పైకి మాత్రం అందంగా నవ్వి వూరుకున్నాడు అది తప్పదు. కావేరిలోని ప్రయాణీకులకు వినయవిధేయతలు చూపాల్సిన విధి అందులోని వర్కర్లది. వైస్ కాప్టన్ అయినా ఆ కస్టమ్‌ని పాటించక తప్పదు.

సీమను వదిలించుకునే సరికి రాజు తల ప్రాణం తోకకు వచ్చింది. అంతా గమనిస్తూనే వున్న కాప్టన్ టోనీ చిరునవ్వులు చిందిస్తాడేగాని ఆవిషయంలో రాజుకు సాయం రాడు.

సీమ అంటే అతనికీ భయమే.

***

"నో సర్ మీ మాట కాదని అంటున్నందుకు క్షమించండి. ఒకళ్ళ క్రింద పనిచేయటం నాకు యిష్టంలేదు. అందును ఆ షిప్పింగ్ కంపెనీలు నా మనస్తత్వానికి అస్సలు సరిపడవ్." పనామాను యాష్ ట్రేలో వేసి మరో సిగిరెట్ వెలిగిస్తూ అన్నాడు షాడో.

సీరియస్‌గా చూశారు కులకర్ణి.

"ఎవరి క్రిందా పనిచేయకుండా అన్ని విషయాలు తెలుసుకోవాలంటే ఎలా కుదురుతుంది? 'కావేరి'లో నీ ఎప్రెంటిస్‌షిప్ పూర్తిచేయటానికి ఏర్పాట్లు జరిగాయి. ఎల్లుండేనీ ప్రయాణం. బీ రెడీ."

"నేను తెలుసుకోవాల్సిన విషయాలు ఏవీ బాకీలేవు. అన్నీ ఎప్పుడో తెల్సుకున్నాను" ఆయన వంక చూడకుండా సమాధానం యిచ్చాడు షాడో.

"నువ్వు తెలుసుకున్న విషయాలు ఏమిటో నాకు బాగా తెలుసు. సబ్‌మెరీన్ మెకానిజం నేర్చుకోమని పంపితే ఆ చీఫ్ ఇంజనీర్ కూతుర్తో

పార్కుల్లో షికార్లు కొట్టడం, ఫ్రిగేట్ నౌకల నావిగేషన్ డీటెయిల్స్ అర్థం చేసుకోమంటే ఆ ఓడ కాప్టెన్ కజిన్ సిస్టర్‌తో బాంబే హోటల్ అశోకా..."

"అన్యాయం సార్. అన్నీ వట్టి కట్టుకథలు. నా మీద కావాలని ఎవరో చెప్పారు యివన్నీ." కులకర్ణిగారి మాట పూర్తికాకముందే అడ్డుపడ్డాడు షాడో.

కోటు జేబులో నుంచి ఫ్రష్ సిగార్‌ని తీసి వెలిగించుకుంటూ లేచి నిలబడ్డారు కులకర్ణి. "రాజూ! అది నా డెసిషన్ కాదు. మన బిగ్ బాస్‌ల ఏకగ్రీవ నిర్ణయం. పాతిక సంవత్సరాల నుంచీ యీ సి.ఐ.బి. మేనేజిమెంట్‌ని చూస్తున్నాను నేను. నాది పోయే వయస్సు కాని వచ్చేది కాదు. త్వరలోనే రిటైర్ కావచ్చు. ఆ తర్వాత సి.ఐ.బి చీఫ్‌గా ఎవర్ని ఎన్నుకోవాలనే సమస్యకు పరిష్కార మార్గాన్ని యిప్పటి నుండే ఆలోచిస్తున్నారు మన బిగ్ బాస్‌లు..."

"ఆ సమస్యకు, నేను కావేరిలో కాళ్ళు చేతులు విరగగొట్టుకోవటానికి సంబంధం ఏముంది?" ఆశ్చర్యంగా అడిగాడు షాడో.

"నిన్ను సి.ఐ.బి చీఫ్ చేయటానికి ఒకే ఒక డ్రాబాక్ వుంది. నావీని గురించి నీకు తెలిసింది చాలా తక్కువ. అందుకే యీ ట్రైనింగ్‌ని అరేంజి చేయటం జరిగింది."

"అనవసరం. నేను చీఫ్‌గా పని చేయదల్చుకోలేదు. నాకు యీ ట్రైనింగ్ వద్దు."

"నథింగ్ డూయింగ్. నీకు కావేరిలో పనిచేయటం యిష్టం లేకపోతే చెప్పు. బాంబేలో రష్యన్ ఫ్రిగేట్ ఒకటి రెడీగా వుంది. కలకత్తా లో బ్రిటిష్ ఆయిల్ టాంకర్ వుంది. జపాన్ షిప్పింగ్ కార్పోరేషన్ వారి రవాణా నౌక 'టుహూటూ' మన విశాఖ పట్టణంలో లంగరు వేయబడి వుంది. వీటిల్లో ఏదో ఒక దాంట్లో నువ్వు పనిచేయక తప్పదు. టేక్ యువర్ ఛాయిస్."

"సార్... రెండు నెలలు టైం యివ్వండి. ఆలోచించుకొని చేస్తాను"

"నో... సరిగ్గా రెండు నిముషాలు వ్యవధి యిస్తున్నాను టెల్ మీ యువర్ ఛాయిస్."

"తప్పదంటారా?"

"తప్పదు."

"ఆల్ రైట్. ఆ ఏడ్చే ఏడుపేదో మనవాళ్ళ దగ్గరే ఏడుస్తాను. కావేరినే ఖాయం చేయండి."

"వెరీ గుడ్..." అంటూ టేబిల్ మీది కాలింగ్ బటన్‌ని నొక్కారు కులకర్ణి.

"రాజు కావేరిలో వర్క్ చేస్తాడు. మన బిగ్ బాస్‌లకు యీ వివరాలు తెలియచేయండి... సెక్యూరిటీ కాప్టన్ వాసును రెడీగా వుండమని చెప్పండి..." అంటూ ఆ విషయాలకు సంబంధించిన ఫైల్ మీద సంతకం చేసి, లోపలికి వచ్చిన సులోచనకు అందించారు.

"వాసు దేనికి సార్?" అనుమానంగా అడిగాడు షాడో.

"కావేరిలో అడుగుపెట్టిన క్షణం నుంచీ నీకు అధికారాలు కాన్సిల్ అయిపోతాయి. నీ యిష్టం వచ్చినట్లు ప్రవర్తించటానికి వీలు లేదు. లేనిపోని గొడవల్లోకి నువ్వు తల దూరిస్తే సివిలియన్ మాదిరి కోర్టుకు పోవాల్సివస్తుంది అందుకని నీకు బాడీ గార్డుగా వాసు వ్యవహరిస్తాడు. అతను కూడా కావేరిలో పనిచేస్తాడు."

"అనవసరం సార్... నేను..."

"షట్ యువర్ బ్లడీ మౌత్. దిసీజ్ యాన్ ఆర్డర్." మౌత్ షట్ చేసుకొని లేచాడు షాడో. సి.ఐ.బికి చెందిన కారొకటి అతన్ని వాసును బాంబే నావీ హెడ్‌క్వార్టర్స్ దగ్గిర వదిలిపెట్టింది. నావీ అధికారులు కావేరిలో ప్రవేశపెట్టారు వారిద్దరినీ.

మూడు నెలలు ట్రెనింగ్ అయ్యేసరికి స్పెషల్ కన్సిడరేషన్ మీద వైస్ కెప్టెన్‌గా ప్రమోట్ అయ్యాడు షాడో. అందుకు కారకులు కులకర్ణి కాదు. కాప్టన్ టోనీ.

"బ్లడీ ఇంటలిజెంట్ బగ్గర్ దిస్ రాజు. ఐ రికమండ్ హిమ్ ఫర్ ది ప్రమోషన్." అంటూ కావేరి ఓనర్లకు రికమండ్ చేశాడతను.

ఎప్పుడు విడుదల లభిస్తుందా అని ఎదురు తెన్నులు చూస్తూ, క్షణమొక యుగంలా గడుపుతున్నాడు షాడో రాజుగా చలామణి అవుతూ.

* * *

అది కావేరి పైభాగంలో వున్న ఎయిర్ కండిషన్ మెస్ హాల్. షిప్‌లో ప్రయాణం చేసే పాసింజర్స్ మాత్రమే అక్కడ భోజనాలు చేస్తారు. కావేరి స్టాఫ్ అక్కడికి రావటానికి వీలు లేదు.

అయితే ప్రయాణీకులకు బోర్ కొట్టకుండా కంపెనీ యివ్వాల్సిన బాధ్యత కాప్టెన్‌ది కాబట్టి అతను ఖచ్చితంగా వచ్చి వారితో కలిసి మీల్స్ తీసుకోవాలి.

ఆ పనిని షాడో నెత్తిమీద వేసి నాక్‌గా తప్పుకోవం కాప్టన్ టోనీ స్పెషాలిటీ. సివిలియన్స్‌తో మాట్లాడటం అంటే అతనికి సరిపడదు.

ఆ రోజు షాడో కూర్చున్న సీటుకు ఎదురుగా కూర్చుని వుంది మిస్ సీమ. ఆమె తండ్రి మల్టీ మిలియనీర్ జయరాం ప్రసాద్, షాడో ఎడమచేతి వైపున కూర్చున్నాడు. కుడి వైపున ఆయన మిసెస్ కూర్చుని వుంది.

"ఉదయం నుంచీ కనిపించటంలేదు... కారణమేమిటి రాజూ?" నాప్‌కిన్‌తో చేతులు తుడుచుకుంటూ అడిగాడు జయరాం ప్రసాద్.

పని హెవీగా వున్నదని గొణిగాడు షాడో.

"ప్రయాణీకులను ఎంటర్‌టెయిన్ చేయాల్సిన పని కూడా మీదే. ఆ సంగతి మర్చిపోయారా?" చల్లగా అంటించింది సీమ. ఆమె జయరాం ప్రసాద్ ఏకైక సంతానం.

సమాధానంగా మరో చిరునవ్వు చిందించి మీల్స్ చేయటంలో మునిగిపోయాడు షాడో.

"రాజు... వచ్చేనెలలో మా కాన్పూర్ ఎరువుల ఫాక్టరీ ఓపెనింగ్, నమ్మకమయిన మనిషి కావాలి నాకు. నిన్ను మానేజర్‌గా పెట్టాలనుకుంటున్నాను. ఏమంటావ్?" ఉన్నట్లుండి అడిగాడు జయరాం ప్రసాద్.

గతుక్కుమన్నాడు షాడో. పొలమారి కళ్ళ వెంట నీళ్ళు తిరిగాయి. జయరాం ప్రసాద్ చాలా పలుకుబడి గల వ్యక్తి. తన బిజినెస్ వ్యవహారాలనుంచి తప్పించుకొని, విశ్రాంతి తీసుకోవటానికి కావేరి ప్రయాణీకుడైనాడు. రెండు నెలల పాటు అందులోనే వుండి అన్ని ప్రదేశాలు తిరిగి పోదామని ఆయన ఆలోచన. షాడోతో పరిచయం అయిన మరుక్షణం నుంచీ అతని మీద ఎంతో అభిమానం ఏర్పడిందాయనకు. దాని ఫలితమే ఆ జాబ్ ఆఫర్.

"ఈ ఉద్యోగంలో నీకు వచ్చే జీతం కంటె నాలుగు రెట్లు ఎక్కువ ఇస్తాను ఆలోచించుకొని సమాధానం చెప్పు " అన్నాడు జయరాం ప్రసాద్.

మంచినీళ్ల గ్లాసు అందుకుంటూ ఓరగా సీమవైపు చూడగానే ఆ ఆఫర్‌కి మూలకారణం ఎవరో అర్ధం చేసుకోగలిగాడు షాడో. ఆమె కళ్ళు అదొక రకమైన కాంతితో మెరుస్తున్నాయి

షాడో గుండెల్లో గుబులు చెలరేగింది. ఇదేదో చాలా దూరం పోయేటట్లుంది ఎట్టి పరిస్థితిలోను తన ఐడెంటిటీ బయట పెట్టకూడదు. అది బయట పెట్టకుండా జయరాం ప్రసాద్ ఆఫర్‌ని తిరస్కరించాలంటే చాలా నేర్పును ప్రదర్శించాలి. ఏ మాత్రం బెడిసినా చాలా గొడవ అవుతుంది. తన వుద్యోగం వూడటమేకాక కావేరి వర్కర్స్ అందురూ చిప్పలు చేత పట్టుకొని వీధుల్లో పడక తప్పదు.

కావేరి ఇండియన్ షిప్పింగ్ కార్పొరేషన్ వారి ఓడ. ఆ కంపెనీకి ముగ్గురు ఓనర్లు. వారిలో ఒకడు జయరాం ప్రసాద్. ఆయన తర్వాత ఆయన ఆస్తికి వారసురాలు సీమ. ఆమె కళ్ళు షాడో మీదపడ్డాయి ఇక భగవంతుడే రక్షించాలి అతన్ని.

సమాధానం ఎలా చెప్పాలా అని షాడో తటపటాయిస్తుండగా, షాడో క్రింది ఆఫీసర్ కురీషి డైనింగ్ హాల్లోకి వచ్చాడు. సరాసరి టేబిల్స్ దగ్గరికి వచ్చే ధైర్యం లేక, దూరంగా నిలబడి సైగచేశాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ" అంటూ లేచి అతన్ని సమీపించాడు షాడో.

"కాప్టెన్ మిమ్మల్ని రమ్మంటున్నారు సార్. బాక్ డెక్ మీద వున్నారు." అన్నాడు కురేషి.

అలాగే చెయ్యి కడుక్కొని అతన్ని అనుసరించాడు షాడో. డెక్ మీద కాలు పెట్టగానే కనిపించిన దృశ్యాన్ని చూసి నిర్ఘాంతపోయాడు.

కావేరికి నాలుగు ప్రక్కలా నాలుగు యుద్ధ నౌకలు నిలబడి వున్నాయి. వాటి గన్స్ అన్నీ కావేరి మీదకే ఎయిమ్ చేయబడి వున్నాయి.

"రాజూ! ఈ వెధవలకు యింకా అనుమానం తీరనట్లుంది ఆ ఆటంబాంబు మన షిప్ లోనే వున్నదన్నట్లు మాట్లాడుతున్నారు ఏం చేద్దాం?" షాడోని చూడగానే ఎదురు వచ్చి వాపోయాడు కాప్టన్ టోనీ.

"ఎన్నిసార్లు వెతుకుతారు సార్? వాళ్ళకైనా వుండాలి. మనకైనా వుండాలి సిగ్గు." చిరుకోపంతో అన్నాడు షాడో.

"ఎగ్జాక్ట్‌లీ! నేనుకూడా సరిగ్గా అదే అనుకుంటున్నాను. వీళ్ళ వ్యవహారం ఏమిటో యిప్పుడే తేల్చేస్తాను" అంటూ కావేరికి అతి దగ్గిరిగా వచ్చిన యుద్ధనౌక వైపు వెళ్ళారు కాప్టన్ టోనీ.

"మీ షిప్‌ని సెర్చి చేయాలి లంగర్ వేయండి." హెచ్చరిక వినవస్తూ న్నదిఆ యుద్ధ నౌక మీద వున్న లౌడ్ స్పీకర్‌లో నుంచి.

"యూ హావ్ డన్ యిట్ వన్స్. మీరిలా నిముషాని కొకసారి సెర్చి సెర్చి అంటూ మా గొంతుల మీద కూర్చుంటే మా షెడ్యూల్ లేట్ అవుతుంది." షాడో అందించిన హేండ్ మైక్‌లో సమాధానం యిచ్చాడు కాప్టన్ టోనీ.

"దిసీజ్ ఎమర్జన్సీ... మీరు వప్పుకోక తప్పదు." హెచ్చరించాడు ఆ నౌక కాప్టన్.

"మా మాటల్ని వినిపించుకోకుండా మీరు యిలా మా దారికి అడ్డం రావటం మమ్మల్ని, మా దేశాన్ని, మా ప్రభుత్వాన్ని అవమానించటానికి చేస్తున్న ప్రయత్నంగా భావిస్తున్నాను ఇందుకు సమాధానాన్ని మీరు మా దేశ నాయకులకు చెప్పుకోవాలి." మరింత మొండిగా సమాధానం యిచ్చాడు టోని.

ఇరుకున పడ్డారు వారందరూ. కాప్టన్ పర్మిషన్ లేకుండా నౌకను చెక్ చేయటం, ఆ నౌక ఏదేశానికి చెందినదో, ఆ దేశాన్ని అవమానించటం లాంటిది.

పక్కకు తొలగి కావేరికి దారి యిచ్చాయి యుద్ధనౌకలు. "బ్లడీ ఫూల్స్! కావేరి కాప్టన్ టోని అంటే ఏమనుకున్నారో! చెక్ చేస్తారేం! చేయండి చూస్తాను!!" మీసాలు మెలివేస్తూ షాడోని చూసి నవ్వాడు టోనీ.

బలవంతంగా నవ్వు ముఖం పెట్టాడు షాడో. యుద్ధ నౌకల కాప్టెన్లు ప్రభుత్వాన్ని కాంటాక్ట్ చేస్తారు. ఆ ప్రభుత్వం ఇండియన్ గవర్నమెంట్ ని రిక్వెస్ట్ చేస్తుంది ఇండియన్ గవర్నమెంట్ నావీ డిపార్ట్‌మెంట్ ద్వారా టోనీకి ఆదేశాలు పంపుతుంది.

మరో అరగంట తర్వాత షాడో అనుకున్నంతా అయింది. టోనీని సెర్చికి అంగీకరించమని మెస్సెజి వచ్చింది బాంబే హెడ్‌క్వార్టర్స్ దగ్గిర్నించి

పళ్ళు కొరుకుతూ వైర్‌లెస్ రూమ్‌ని లాక్ చేశాడు కాప్టెన్ టోనీ, మెకానిక్లను పిలిచి వైర్‌లెస్ సెట్‌కి రిపేర్లు చేయించటం ప్రారంభించాడు.

"ఎవరైనా అడిగితే యీ మెస్సెజి నాకు సరిగ్గా అందలేదని చెప్తాను. మన వైర్‌లెస్ సెట్ పాడయిపోయింది గదా! ఎలా అందుతాయి వార్తలు?" షాడో వంక చూస్తూ అడిగాడు.

తాము పంపిన మెస్సెజికి సమాధానం రాకపోవటంతో కల్హారీ పట్టణంలో వున్న ఇండియన్ ఎంబసీకి కబురు పంపించింది భారతప్రభుత్వం. వేగంగా నడిచే మీడియమ్ సైజ్ మోటార్ బోటు మీద కావేరిని సమీపించి, ప్రభుత్వపు ఆదేశాన్ని టోనీకి వినిపించారు ఎంబసీ అధికార్లు.

ఫలితంగా మరోసారి సెర్చికి గురి అయింది కావేరి. రిజల్ట్‌లో పెద్ద డిఫరెన్స్ ఏమీలేదు. ఆటంబాంబు కాదు గదా దాని పోలికలున్న వస్తువు

కూడా ఎవరికీ కనిపించలేదు. అనుకున్న టైంకంటే మరో ముప్పై ఆరుగంటలు లేట్‌గా ప్రయాణం ప్రారంభించింది కావేరి.

"మనం ఎటు పోతున్నామో అర్థం కావటం లేదు. ఈ ప్రపంచం అసలు ఏమౌతుందో అంతు బట్టటం లేదు. నిజాయితీకి విలువ లేకుండా పోయింది యీ రోజుల్లో" షాడోని తన కాబిన్‌కి పిలిచి నావీ అధికారులు తనకు పంపించిన మెమోలను చూపిస్తూ మొరపెట్టుకున్నాడు కాప్టన్ టోనీ.

వస్తున్న నవ్వును బలవంతంగా అదిమిపెట్టుకున్నాడు షాడో. కొంచెం సానుభూతి చూపించి, మెల్లిగా బయటపడ్డాడు అక్కడినుంచి.

సాయంత్రం నాలుగు గంటలు కావస్తున్నది టైం. కావేరి అంటార్కిటిక్‌ని దాటి హిందూ మహా సముద్రంలోకి అడుగుపెడుతున్నది. అక్కడినుంచి సూటిగా ఆస్ట్రేలియా పోతుందది. కల్హారీలో లోడ్ చేసిన చెక్క పెట్టెల్ని జనరేటర్లను ఆస్ట్రేలియాలో అన్ లోడ్ చేయాలి.

ఆ మాట జ్ఞప్తికి రాగానే... వాటితోపాటు కావేరిలో ఎక్కిన ఐదుగురు ప్రయాణీకులు షాడో మదిలో మెదిలారు.

విక్టర్ అనబడే మిలీయనీర్. అతని కొడుకు నెపోలియన్. వారి అంకుల్‌ని ఆస్ట్రేలియాకు తీసుకుపోతున్నారు. కదలలేని వృద్ధుడా అంకుల్.

ఎప్పుడూ వీల్ ఛైర్‌లోనే వుండాలి. అతనికి సేవలు చేయటానికి ఇద్దరు నర్సులు...

కావేరి ప్రయాణం ప్రారంభించి నాలుగు రోజులయింది. తమ కాబిన్స్‌ని వదిలిపెట్టి యింతవరకూ ఒక్కసారి కూడా డెక్ మీదికి రాలేదు ఆ అంకుల్. విక్టర్, నెపోలియన్లు మాత్రం ఇరవై నాలుగు గంటలూ డెక్ మీదనే వుంటారు.

వంట్లో బాగుండలేదు కాబోలు... అనుకుంటూ కంట్రోలింగ్ టవర్ దగ్గర నిలబడి సిగరెట్ వెలిగించుకున్నాడు షాడో.

నాలుగు పెగ్ లు బిగించి విశ్రాంతి తీసుకుంటున్నాడు టోనీ. డ్యూటీలన్నీ చీఫ్ ఆఫీసర్ మీదే పడతాయి.

***

ఆరు గంటలకల్లా యీవెనింగ్ టీ తీసుకోవటానికి మెస్ హాల్లో సమావేశమైనారు ప్రయాణీకులందరూ. తన డ్యూటీలన్నిటినీ మిగిలిన ఆఫీసర్లకు వప్పగించి మెస్ హాల్లో ప్రజెంట్ అయ్యాడు షాడో.

వెంటనే అతన్ని పట్టుకున్నాడు జయరాం ప్రసాద్. "వాట్ రాజూ! నీ నేటివ్ ప్లేస్ఏది?" అన్నాడు టీ సిప్ చేస్తూ.

"అది సార్... అది... అది..." అంటూ అటూ యిటూ చూశాడు షాడో.

అదే సమయంలో ఒక కళాసీ మెస్ హాల్ ముందు నిలబడి శాల్యూట్ చేశాడు. అతన్ని చూడగానే తేలిగ్గా నిట్టూర్చి లేచి నిలబడ్డాడు షాడో.

"సార్ కాప్టన్ టోని మిమ్మల్ని కంట్రోలింగ్ టవర్ దగ్గిరికి రమ్మన్నారు అర్జెంటుట" వినయంగా నిలబడి తెలియచేశాడు ఆ కళాసీ.

జయరాం ప్రసాద్ వైపు చూశాడు షాడో.

"వెళ్ళిరా రాజు! అసిస్టెంట్ అన్న తర్వాత తప్పవు యివన్నీ. అందుకే నా జాబ్ ఆఫర్‌ని గురించి బాగా ఆలోచించమని చెప్తున్నాను.." అన్నాడాయన.

సమాధానంగా ఓ చిరునవ్వు విసిరి కంట్రోలింగ్ టవర్ దగ్గరికి వెళ్ళాడు షాడో.

"రాజు! మన సెకండ్ కుక్ ప్రీతిపాల్ మూడు గంటల్నించి కనిపించటం లేదట!" అంటూ ఆందోళనగా ఎదురు వచ్చాడు కాప్టెన్‌టోనీ.

"ఎక్కడైనా పడక వేశాడేమో చూడకపోయారా?" అడిగాడు షాడో.

"నో... నో... ప్రీతిపాల్ అటువంటి మనిషి కాదు. పది సంవత్సరాల నుంచీ మన షిప్ లో పనిచేస్తున్నాడు ఇంతవరకూ ఒక్కసారి కూడా ఆల్కహాల్ ని టచ్ చేయలేదు! సీ సిక్‌నెస్ మూలంగా ఎక్కడైనా పడిపోయి వుంటాడు. మొత్తం నౌకనంతా గాలించు."

సీ సిక్‌నెస్ రకరకాలుగా వచ్చే వ్యాధి. ఒక్కోసారి నిలబడిన మనిషి నిలబడినట్లే విరుచుకు పడిపోయే అవకాశాలున్నాయి.

సెర్చిని ప్రారంభించాడు షాడో. డెక్ అంతా పరీక్షించబడింది. ఆ తర్వాత లోడింగ్ ఎపార్ట్‌మెంట్స్. తర్వాత పాసింజర్ కాబిన్స్ వైపు బయలుదేరాడు షాడో. సన్నగా పొడవుగా వున్న ఆ కారిడార్స్ నన్నిటినీ జాగ్రత్తగా చెక్ చేస్తూ విక్టర్, నెపోలియన్స్ వుండే గదుల్ని సమీపించాడు.

కదలలేని వృద్ధుడు, అతని నర్సులు గదిలోనే వున్నారు. "సారీ సర్. ఇటు ఎవరూ రాలేదు..." షాడో మాట వినగానే ఠక్కున సమాధానం యిచ్చింది ఒక నర్సు.

"థేంక్యూ సిస్టర్" అంటూ కారిడార్ చివరికి పోయాడు షాడో.

ఆ చివరగా వున్నది ఒక ఎయిర్ కండిషన్డ్ డీలక్స్ కాబిన్. జయరాం ప్రసాద్ అండ్ ఫామిలీ వుంటుంది అందులో దాని ముందు నుంచి పోతున్న షాడో కాబిన్ తలుపులు ఓరగా తెరిచి వుండటం గమనించి క్షణకాలం విపరీతమైన ఆలోచనకు గురి అయ్యాడు. తెరిచి వున్న తలుపుల్ని చూసి లోపలకు వెళ్ళి పడిపోయాడేమో ప్రీతిపాల్.

అనుమతి లేకుండా ఆ గదిలోకి పోవటం నేరం. కాని అనుమతి తీసుకోవటానికి చాలా టైం వేస్ట్ అవుతుంది. ఈ లోపల ప్రీతిపాల్ మాయం అయినట్లు ప్రయాణీకులు అందరికీ తెలుస్తుంది మనశ్శాంతి కోసం కావేరి

ప్రయాణీకులైనారు వారందరూ. ఇటువంటి అవాంఛనీయమైన సంఘటనలు వారికి ట్రబుల్ ని కలిగిస్తాయి.

జస్ట్ రెండు నిముషాల పనికి అన్ని బాధల్ని కొని తెచ్చుకోవటం దేనికి?

అటూ యిటూ చూసి ఆ కాబిన్‌లోకి అడుగుపెట్టాడు షాడో.

అందమైన ఫర్నీచర్‌తో నిండి వున్నదది. సూట్‌కేసులు అలమరాల నిండా పేర్చి వున్నాయి. సీమ ధరించే ఖరీదయిన దుస్తులు హేంగర్లకు తగిలించి వున్నాయి.

గదిలో వున్న మంచాల క్రింద చూశాడు షాడో. గోడలకు వ్రేలాడుతున్న సిల్క్ కర్టెన్ల వెనుక గాలించాడు. ప్రీతిపాల్ కనిపించలేదు. వెనుతిరగబోతుండగా, అతని చేయి తగిలి హేంగర్ మీది నుంచి జారి క్రింద పడింది ఫర్ కోటు ఒకటి.

దాదాపు పదివేల రూపాయలు విలువచేస్తుందది దాని బటన్స్ అన్నీ పగడాలతో చేయబడ్డాయి కుట్టుకూలీనే అవుతుంది రెండు మూడు వేలదాకా.

మడతలు చెదిరిపోకుండా దాన్ని హేంగర్ కి తగిలించి, వెనక్కి తిరిగాడు షాడో. ఎప్పుడు వచ్చిందో కానీ, నిశ్శబ్దంగా లోపలికి వచ్చి, నడుము మీద చేతులు వేసుకొని అతని వంకే చూస్తున్నదిసీమ.

***

"వెల్ మిస్టర్ రాజు! నువ్వు ఒక సంవత్సరమంతా కష్టపడి పనిచేస్తే వచ్చే డబ్బు, ఆ ఒక్క కోటును తీసుకుపోయి అమ్ముకుంటే అతి తేలికగా వస్తుంది" అన్నది సీరియస్‌గా చూస్తూ.

ప్రీతిపాల్‌ని గురించిన ఆలోచనలతో సతమతమౌతున్న షాడోకు చిరాకును కలిగించాయి ఆ మాటలు.

"దొంగిలించదలుచుకుంటే ఇటువంటి గుడ్డ పేలికలు నాకో లెక్కలోకి రావు. నేను వచ్చింది వేరే పని మీద" అన్నాడు అన్యమనస్కంగా.

"వేరే పని అంటే ఏమిటో! నగలు డబ్బు ఏమైనా దక్కుతాయని వచ్చావా?" వ్యంగ్యంగా ఎత్తి పొడిచింది సీమ.

సమాధానం యివ్వకుండా - గది బయటకు వెళ్ళబోయాడు షాడో. చటుక్కున అడ్డుకున్నది సీమ.

"నాకు సమాధానం యివ్వకపోతే మా పేరెంట్స్‌ని పిలుస్తాను అప్పుడు కాని నీకు అర్థంకాదు..." అంటూ డోర్ ప్రక్కనే వున్న ఫోన్ మీద చెయ్యి వేసింది.

సిగిరెట్ వెలిగించుకుంటూ ఒక సోఫాలో కూర్చున్నాడు షాడో. జయరాం ప్రసాద్ గారికి యీ విషయం తెలిస్తే ఆయన ఎలా ప్రవర్తిస్తాడో

తెలియదు. అనుమతి లేకుండా తన కాబిన్‌లో ప్రవేశించినందుకు మండిపడితే...

తన ఉద్యోగం వూడిపోతుంది. అంతేగదా! ప్రాణాలు తీయలేడుగా!!!

"ఆ చేత్తోనే కాప్టన్‌కి కనెక్షన్ యివ్వమని టెలిఫోన్ ఆపరేటర్‌కి చెప్పు" అన్నాడు సిగరెట్ వెలిగించుకుంటూ.

ఫోన్ ఎత్తబోతున్న సీమ - వెక్కిరింపుగా నవ్వింది. "చేసిన తప్పుకు వత్తాసుకావాల్సి వచ్చిందా?" అన్నది ఎగతాళిగా.

"అందువల్ల ప్రయోజనం ఏముంది మిస్ సీమా! మీరు యీ షిప్పింగ్ కంపెనీకి కాబోయే అధికారులు. ఆ కాప్టన్ కూడా నాలాంటి వాడే. మీ క్రింద పనిచేసి మీరు దయ తలచి యిచ్చిన జీతం తీసుకొని బ్రతుకుతున్న వాడే. అతను నాకు చేయగల సహాయం ఏముంది? గో ఆన్... మీ ఫాదర్ ని పిలవండి. నాకు అవతల చాలా పనులున్నాయి." విసుగ్గా అన్నాడు షాడో.

రక్తం లేనట్లు పాలిపోయింది సీమ ముఖం. షాడో నోటి వెంట అటువంటి సీరియస్ మాటలు యింతకు ముందు ఎన్నడూ విని వుండలేదామె.

"మా గదిలోకి రావాల్సిన కారణం ఏముంది?" అన్నది మెల్లిగా.

"అది చెప్పినా మీకు అర్థం కాదు. అర్థం అయినా కానట్లు నటిస్తారు మీరు. అసలు మీలాంటి మిలియనీర్స్ బుద్ధులే అటువంటివి. దయచేసి మీ ఫాదర్ ని పిలవండి." ఉద్యోగానికి గుడ్ బై చెప్పి యింటికి వెళ్ళిపోదామన్న నిశ్చయం దృఢంగా నాటుకుపోయింది షాడో మనస్సులో. అందువల్ల మాటలు మహాకటువుగా దొర్లసాగాయి.

ఒక్కొక్క మాట ఒక్కొక్క బాకు పోటులా బాధపెట్టాయి సీమను. కళ్ళు చెమ్మగిల్లాయి

"రాజు... నేను...నేను... నాకు డబ్బు వున్నదన్న అహంకారంతో ప్రవర్తించానా? నా మాటలు నీకు అలా వినిపిస్తున్నాయా?" అని అడిగింది గద్గదస్వరంతో.

"ఒక్కసారి నీ ప్రవర్తనను విమర్శించి చూసుకో. కావేరి వర్కర్లలో నువ్వు ఏడిపించని వాళ్ళు ఎవరూ లేరు. నువ్వు కనిపిస్తే వాళ్ళందరూ భయపడి దూరంగా తప్పుకు తిరగటానికి కారణం ఏమిటి? వారిని ఆటలు పట్టించి నువ్వు హేళన చేస్తున్నా, ఏడవలేక నవ్వుతున్నారు వారందరూ. ఎందుకని? ఏమయినా అంటే ది గ్రేట్ సీమగారు, తన తండ్రిగారితో చెప్పి వుద్యోగాలు వూడగొట్టించి, చిప్పలు చేతికి యిప్పించగలదు. వారితోబాటే నేను ఒక వర్కర్నే. నా విషయం మాత్రం వేరుగా ఎందుకుంటుంది?"

రాతి బొమ్మలా నిలబడి పోయింది సీమ. మాట్లాడాలని ఎంత ప్రయత్నించినా ఆమె నోటివెంట మాటలు పెగలలేదు.

తన నిర్ణయాన్ని కాప్టన్ టోనీకి చెప్పి, తట్టాబుట్టా సర్దుకుందామనే నిశ్చయంతో తనే ఫోన్ ఎత్తాడు షాడో. వెంటనే పలికాడు కాప్టన్ టోని.

"రాజు! నువ్వు బయలుదేరి డెక్ మీదికి రా. అర్జంట్" అన్నాడు ఎంత దాచుకుందామనుకున్నా అతని కంఠం లోని వణుకు షాడో నిశిత దృష్టికి వినిపించకుండా వుండలేక పోయింది.

"కారిడార్స్ అన్నిటినీ చెక్ చేశాను సార్. ప్రయోజనం ఏమీలేదు. నేను మీకు ఒక విషయం చెప్పాలని ఫోన్ ఎత్తాను.. అది..."

"షటప్ యూ బ్లడీ యిడియట్, కమాన్ హర్రీ ఆఫ్..." షాడో మాట పూర్తి కాకుండానే ఫోన్ పగిలి పోయేటట్లు అరిచాడు కాప్టన్ టోని.

అదిరిపడి రిసీవర్‌ని క్రెడిల్ చేశాడు షాడో. దారికి అడ్డంగా నిలబడి వున్న సీమను పక్కకు తోసి కారిడార్లోకి పరుగు తీశాడు.

అప్పటికి పూర్తిగా తేరుకున్నది సీమ. తను సరదాగా అన్న మాటల్ని అతను అపార్థం చేసుకోవటానికి వెనుక ఏదో బలమైన కారణం వున్నదనే విషయం ఆమెకు అర్థం అయింది.

"ఏమయింది రాజు? ఎందుకీ హడావుడి?" షాడో ప్రక్కగా పరుగెత్తుతూ అడిగింది కుతూహలంగా.

చెప్దామా వద్దా అని తటపటాయించాడు షాడో. చెప్పటం యిష్టంలేదు. కాని యిప్పుడు కాకపోయినా, మరి కొంతసేపటికి వాళ్ళ కాబిన్ లోకి పోయినందుకు ఎక్స్ ప్లనేషన్ యిచ్చుకొని తీరాలి. అప్పుడైనా అసలు విషయం ఆమెకు తెలుస్తుంది అదేదో యిప్పుడే చెప్పి బాధ విరగడ చేసుకుంటే పోలా?

ప్రీతిపాల్ కనిపించటం లేదన్న మాట వినగానే నిర్ఘాంతపోయింది సీమ.

"ఐయామ్ సారీ రాజూ... నిజంగా నాకీ విషయం తెలియదు. ఈ వ్యవహారం యింత సీరియస్ గా వుంటుందని ఏ మాత్రం తెలిసినా నేను అసలు ఆ గదిలోకి వచ్చేదాన్నే కాదు..." అన్నది జాలిగా ముఖం పెట్టి.

ఆమెకు సమాధానం ఏమని యివ్వాలా అని ఆలోచిస్తూ డెక్ మీద అడుగుపెట్టాడు షాడో. రేడియో రూమ్ దగ్గర వున్నాడు కాప్టన్ టోనీ.

"రాజూ! నాకు పిచ్చి ఎక్కేటట్లుంది" అన్నాడు షాడోని చూడగానే.

"ఏమయింది సార్?" అడిగాడు షాడో... రేడియో రూమ్ ముందు విషణ్ణ వదనాలతో నిలబడి వున్న ఆఫీసర్లను షిప్ డాక్టర్ శర్మను చూస్తూ.

"లోపలకు పోయి చూడు, నీకే తెలుస్తుంది"

సీమను బయట నిలబడమని హెచ్చరించి రేడియో రూమ్ లోకి పోయాడు షాడో.

"డామ్ డర్టీ బిజినెస్. రాజు అసలు యిదంతా ఎందుకు జరుగుతున్నదో అర్థం కావటం లేదు..." షాడోని చూస్తూ కామెంట్ చేసాడు డాక్టర్ శర్మ.

ఆ మాటలు వింటూ ఒక వైర్‌ని అవతాలికి లాగి, వైర్‌లెస్ ట్రాన్స్ మీటర్ వెనక్కి చూస్తున్న షాడో, కొరడా పెట్టి కొట్టబడినట్లు ఎగిరి వెనక్కిదూకాడు.

రక్తపు మడుగులో పడి వున్నాడు రేడియో ఆపరేటర్ శివరామ్. అతని వీపులో దిగబడి వున్నది ఆరంగుళాల పిడిబాకు.

***

"ఎందుకు! ఫర్ గాడ్ సేక్!! ఈ హత్యలు ఎందుకు మధ్యాహ్నం ప్రీతిపాల్ మాయం అయ్యాడు. ఇప్పుడు శివరాం వెళ్ళిపోయాడు. ఇతన్ని చంపటంవల్ల హంతకులకి ఏం లాభం వుంది?" బాధగా అంటున్న కాప్టెన్ టోనీని అవతలకు లాక్కుపోయాడు షాడో.

దూరంగా నిలబడివున్న ఫోర్త్ ఆఫీసర్ వాసును పిలిచి శివరామ్ శరీరాన్ని అక్కణ్నించి తొలగించమని ఆర్డర్స్ యిచ్చాడు.

రెండు పెగ్గులు పడేసరికి మామూలు మనిషి అయ్యాడు కాప్టెన్ టోనీ.

"సార్... హత్య ఎందుకు జరిగినా... హంతకుడు మన మధ్యలోనే వున్నాడని మర్చిపోకండి. కావేరి సముద్ర మధ్యంలో వుంది. బయటి నుంచి వచ్చి హత్యచేసే అవకాశం ఎవరికీ లేదు. హంతకుడు కావేరీలోనే ప్రయాణం చేస్తున్నాడు ప్రీతిపాల్ శరీరం మనకి కనిపించలేదు. అతను కూడా యిదే గతికి లోనై వుంటాడు." సాలోచనగా చెప్పాడతనికి షాడో.

"ఎవరు చేశారంటావ్?" అడిగాడు కాప్టన్ టోనీ.

"యూ లీవ్ దట్ టు మీ... ముందు ఈ విషయాన్ని ప్రయాణీకులకు చెప్పి వాళ్ళు ఖంగారు పడకుండా చూడండి..." అంటూ అతనికి మరో రెండు పెగ్గుల్ని పోసి బలవంతంగా మెస్ హాల్ వైపు పంపించాడు షాడో.

***

పది గంటల సమయానికి ఆ విషయం అందరికీ తెలిసిపోయింది. భయపడుతున్న కావేరి వర్కర్స్‌ని సముదాయించే బాధ్యత షాడో మీద పడింది. కలత బారిన మనస్సుతో మూడీగా వున్న పాసింజర్లను చూసి పెద్ద వుపన్యాసం యిచ్చాడు కాప్టన్ టోనీ.

శివరామ్ హత్యచేయబడ్డాడని అంటే వాళ్ళందరూ అస్సలు మాట వినరని శివరామ్ గుండె జబ్బుతో మరణించినట్లు ఎనౌన్స్ చేశాడు. అసలు విషయాన్ని ఎట్టి పరిస్థితులలోను బయటపెట్టవద్దని సీమను హెచ్చరించాడు.

"హాయిగా ఆనందంగా కాలం గడపటంకోసం మా నౌకను ఎన్నుకున్నారు మీరు. అటువంటి సమయంలో యీ మరణ వార్తలు మీకు మనఃక్లేశాన్ని కలిగిస్తాయని తెలుసు. అందుకు ఎంతగానో విచారిస్తున్నాను శివరామ్ ఎంతో నమ్మకస్తుడు చాలా మంచివాడు... అతనిలా అర్థాంతరంగా గుండె జబ్బుతో మరణించటం... నిజంగా చాలా విచారించవలసిన విషయం. ఇక మాయమైపోయిన మా కుక్ ఎలాంటి వాడో ముఖ్యంగా తెలుసు మీ అందరికీ."

"ఓడ నడిచే సమయంలో నీటివంక చూడకండి. ఆ దృశ్యం ఎంతో ఆనందంగా కనిపిస్తుంది మీకు తెలియకుండా మీరు డెక్ చివరికి పోయి క్రిందికి తొంగి చూడటం జరుగుతుంది. ఓవర్ బాలెన్స్ అయి నీటిలో పడిపోతారు. మా ప్రీతిపాల్‌కి కూడా అదే గతి పట్టిందని నా నమ్మకం." బార్ రూమ్ లో సమావేశమైన ప్రయాణీకులందర్నీ హెచ్చరించాడు కాప్టెన్ టోనీ.

అతని మాటలు అసత్యాలు కాదు. ఓడ ప్రయాణించే సమయాల్లో ఎగసి పడుతున్న కెరటాలు మానవుల మనస్సుల మీద ఒక విధమైన హిప్నోటిక్ రియాక్షన్‌ని కలిగిస్తాయి. కొమ్మలు తిరిగిన నావికులే అలా నీటిలోపడి ప్రాణాలు పోగొట్టుకున్న వుదంతాలు చాలా వున్నాయి.

కాప్టన్ టోనీ మాటలతో దిగజారిపోతున్న వుత్సాహాన్ని తిప్పి తెచ్చుకోవటానికి విపరీతమైన ప్రయత్నం చేశారు ప్రయాణీకులందరూ. అది గమనించిన జయరాం ప్రసాద్ ఒక ప్రపోజల్‌ని వారి ముందుంచాడు.

"ఫ్రెండ్స్! కాప్టన్ టోనీ మాటల్ని విన్నారు మీరు. ప్రాణాల్ని పోగొట్టుకున్న వారి ఆత్మలకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రే చేద్దాం మనం. మనం యిలా విచారంగా వుండటం ఏమంత బాగాలేదు. మన మనస్సులను ఆహ్లాదపరచి మనకు వుత్సాహాన్ని యిచ్చేటందుకు ఒక ప్రోగ్రాంని అరేంజి చేయబోతున్నాను."

"రేపు నా మిసెస్ బర్త్ డే. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని రేపు సాయంత్రం ఆరు గంటలకు నేనొక పార్టీ యిస్తున్నాను మీరందరూ ఎటెండ్ అయి సంతోషంగా టైమ్ పాస్ చేయాలని నా ఆకాంక్ష."

చప్పట్లు చరిచి తమ ఆమోదాన్ని తెలియచేసారందరూ.

మెల్లగా వారిని ఆవరించుకొని వున్న మూడి తెరలు మరుగునపడటం ప్రారంభించాయి.

"హల్లో మిస్టర్ రాజు! మీరు కూడ పార్టీకి వస్తున్నారు కదూ?" అన్న మాటల్ని విని వెనుతిరిగాడు షాడో.

కల్హా రీ రేవులో ఎక్కిన ప్రయాణీకులలో ఒకడైన నెపోలియన్ నిలబడి వున్నాడు నవ్వుతూ.

"తప్పకుండా వస్తాను కాని ఎంతోసేపు వుండటానిని వీలుకాదు. నా డ్యూటీ ఆరున్నరకు ప్రారంభమవుతుంది" నవ్వుతూనే సమాధానం యిచ్చాడు షాడో.

ప్రీతిపాల్, శివరామ్‌ల గురించి మరో రెండు నిమిషాలు మాట్లాడి పక్కకు పోయాడు నెపోలియన్.

సిప్ చేస్తున్న బీర్ గ్లాసును టేబిల్ మీద పెట్టి వాచి చూసుకున్నాడు షాడో. పదిన్నర అయింది. ఇంకో పది నిముషాలలో డెక్ మీదికి పోయి, స్కాటింగ్ డ్యూటీలో వున్న కురేషీని రిలీవ్ చెయ్యాలి. ఆ తర్వాత తెల్లవారేదాకా బయటే నిలబడి వుండాలి.

హాయిగా వున్న ప్రాణాన్ని కష్టపెట్టుకోవటమంటే యిదే కాబోలు అనుకుంటూ, మరో గ్లాసు బీర్‌ని పట్టించి వెనుతిరిగాడు షాడో.

అదే సమయంలో మెల్లగా బార్ రూమ్ లోకి వచ్చాడు వాసు.

"ఇంజన్ రూమ్ వదిలి ఎందుకిలా వచ్చావ్? టోని చూసాడంటే నిన్ను నరికి ముక్కలు చేసి విస్కీలో నంచుకుని తింటాడు." నవ్వుతూ అన్నాడు షాడో.

"రాజు! కావేరి దారి తప్పింది. ఎనిమిది డిగ్రీలు దక్షిణంగా పోతోంది. మరో పన్నెండు మైళ్ళదూరంలో పగడాల గుట్టలున్నాయి. ఒక్కసారిగా

మళ్ళిస్తే కొంచెం గొడవ జరగవచ్చు. మళ్ళించకపోతే ఆ గుట్టలకు గుద్దు కుంటాం.."

"వాటీస్ దిస్? ఎందుకిలా జరిగింది? స్కాటింగ్ డ్యూటీలో ఎవరున్నారు?"

"కురీషీ వున్నాడు."

"ఏం చేస్తు న్నాడు?నిద్రపోతున్నాడా?" కోపంగా అడిగాడు షాడో.

"పావుగంట క్రితం రూట్‌ని చెక్ చేసాం యిద్దరం. అప్పుడు బాగానే వుంది. ఉన్నట్టుండి మారింది రూట్. కారణం తెలుసుకుందామని పోతే అక్కడ ఎవరూ లేరు. కురీషీ ఏమైపోయాడో ఎక్కడికి పోయాడో తెలియటం లేదు."

ఉలిక్కిపడి బయటకు పరుగుతీశాడు షాడో. డెక్ మీద విశ్రాంతి తీసుకుంటున్న ప్రయాణీకులకు అనుమానం కలిగించని విధంగా డెక్‌నంతా గాలించాడు వాసుతో కలిసి.

సరిగ్గా స్కాటింగ్ ప్లేస్‌కి నాలుగు గజాల దూరంలో వున్న ఆయిల్ డ్రమ్ వెనుక కనిపించాడు కురీషీ. అతని గుండెల్లో నుంచి బయటికి తొంగి చూస్తున్న కత్తి క్లియర్‌గానే కనిపిస్తోంది

"వాసూ... టార్పాలిన్ తెచ్చి కప్పు. ఇక్కడికి ఎవరిని రానీయకు..." అంటూ డెక్ మీదికి పరుగు తీశాడు షాడో.

"లేడీస్ అండ్ జంటిల్మన్... మీ అందరి కోసం యీ రోజు ఒక స్పెషల్ ప్రోగ్రాం అరేంజి చేశాం. మిమిక్రీ చేయటంలో అద్వితీయులైన మా కళాసీలు యిద్దరు మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేస్తారు. దయచేసి అందరూ మన మినీ థియేటర్ లోకి వెళ్లండి..." అని ఎనౌన్స్ చేసాడు చిన్న హాండ్ మైక్ లో.

ఒకరి తర్వాత ఒకరుగా థియేటర్ వైపు బయలుదేరారు ప్రయాణీకులు. అక్కడినుంచి సూటిగా వర్కర్స్ వుండే కాబిన్ వైపు పరిగెత్తాడు షాడో.

అప్పుడే నిద్రకు వుపక్రమిస్తున్నారు డ్యూటీ అయిపోయిన వారందరూ. వారిలో జగన్, జోగిందర్ అనే కళాసీలను బలవంతంగా తీసుకుపోయి స్టేజి ఎక్కించాడు షాడో. "ప్రయాణికులను సరిగ్గా ఒక గంటసేపు మైమరపించాలి. వాళ్ళకు బోర్ కొట్టి బయటకు రావటం అంటూ జరిగితే మీ యిద్దరి మెడలకు తాళ్ళు కట్టి నీళ్ళలో వ్రేలాడతీస్తాను.." అని హెచ్చరించి కాప్టన్ టోనీని వెతుక్కుంటూ బయలుదేరాడు.

మిమిక్రీ చేయటంలో జగన్, జోగిందర్‌లు నిజంగా అసాధ్యులు. వారి ప్రోగ్రాం ఆ రోజు సూపర్ హిట్ అయింది. నవ్వలేక నానా బాధలు పడుతున్న ప్రయాణీకులు కావేరి షార్ప్‌గా పక్కకు జరగటాన్ని గమనించలేక పోయారు. సముద్ర మధ్యంలో నిట్టనిలువుగా లేచివున్న

పగడపు గుట్టల్ని తప్పుకొని వెంట్రుక వాసిలో ప్రమాదం నుంచి బయట పడిన సంగతి కూడా వారెవ్వరికీ తెలియదు.

"రాజూ! ఇప్పుడేం చేయాలి? మరో హత్య జరిగిందని చెప్పటానికి వీలులేదు. కురీషీ మరణాన్ని కప్పిపెట్టటానికి కూడా ఛాన్సులేదు... ప్రయాణీకులు గోలపెట్టేశారు. ఇక కావేరీలో ప్రయాణించటానికి పాసింజర్లు ఎవరూ రారు.." జుట్టు పీక్కున్నంత పని చేస్తూ అంటున్న కాప్టన్ టోనిని బలవంతంగా కాబిన్‌లోకి పంపించాడు షాడో.

మర్నాడు సీ బరీయల్‌కి సిద్ధంగా వుంది శివరామ్ శరీరం. అందమైన చెక్కపెట్టెలో పెట్టి దాన్ని సముద్రంలో వదిలివేయటమే సీ బరీయల్‌కి అర్థం.

రూల్స్‌కి వ్యతిరేకమని తెలిసికూడా, కురీషీని అదే పెట్టెలో పెట్టించాడు షాడో. కురీషీని గురించి ఎవరైనా అడిగితే వంట్లో బాగోలేక పోవటం మూలంగా క్లినిక్‌లో ఎడ్మిట్ అయినట్లు చెప్పమన్నాడు.

కంట్రోలింగ్ టవర్‌లో వున్న రైటింగ్ పాడ్‌ని అందుకొని కురీషీ బంధువులకు జరిగిన విషయాలను తెలియజేస్తూ ఒక లెటర్ వ్రాసి, సంతకం కోసం టోని గదికి పంపించి, తను స్కాటింగ్ ప్లేస్ కి బయలుదేరాడు.

అగ్ని పర్వతాల్లా విజృంభిస్తున్నాయి అతని మనస్సులోని ఆలోచనలు.

కావేరిలోని ప్రయాణీకులందరూ మల్టీ మిలీయనీర్స్. ఇలా ఒకటీ రెండూ హత్యలు చేసి, నెమ్మదిగా హంతకులు వారందర్నీ బంధించి బ్లాక్ మెయిల్ చేయదల్చుకున్నారా?

ఆపైన ఆలోచించటానికి మనస్కరించక చేతిలోని సిగరెట్ని సముద్రంలోకి విసిరికొట్టి డెక్ మీద పచార్లు చేయటం ప్రారంభించాడు.

చల్లటి గాలి రివ్వుమంటూ వీస్తున్నది ప్రయాణించే రూట్ని క్రమబద్ధం చేయటం వలన సాఫీగా నడుస్తున్నది కావేరి.

చలి వేస్తుండటంవల్ల సిగరెట్ పారవేసి రెండు నిముషాలు కూడా గడవకముందే మరొక పనామా తీసాడు షాడో.

లైటర్ వెలిగించబోయి ఆఖరి క్షణంలో ఆగిపోయాడు. మెల్లిగా కదలిక కనిపించకుండా నీడలలోకి జరిగి నిలబడ్డాడు. రెండు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచిపోయాయి. నిలబడిన చోటును వదిలి ముందుకు తిరిగాడు షాడో. పిల్లిలా అడుగులు వేస్తూ డెక్ చివరికి చేరుకున్నాడు. అక్కడే ప్రయాణీకులు కాబిల్ లోపలికి పోయే దారి ఉంది. ద్వారం లోపల అరవై కాండిల్స్ బల్బు దేదీప్యమానంగా వెలుగుతున్నది.

ద్వారం పక్కగా నిలబడి లోపలికి తొంగి చూసాడు. అతని అనుమానం నిజం అయింది. కారిడార్‌లో నడుస్తున్న వ్యక్తి కావేరి వర్కర్ కాదు. ప్రయాణీకులందరితోనూ పరిచయం చేసుకొన్నాడు షాడో. వారిలో ఆ వ్యక్తి ఎన్నడూ కనిపించలేదు.

మరి కొంచెం ముందుకు జరిగి చూశాడు షాడో.

విక్టర్, నెపోలియన్‌లు బసచేసిన కాబిన్‌లోకి పోయాడతను. సిగరెట్ వెలిగించుకొన్నాడు షాడో. పోయి అటో యిటో తేల్చుకోమని తొందర పెట్టబోయింది హృదయం. కాని తొందరపడటంవల్ల ప్రయోజనం వుండదని గ్రహించి ఆ కోరికను అణుచుకున్నాడు. సిగరెట్‌ని పెదిమల మధ్యకు చేర్చి ఒక మూలగా నిలబడ్డాడు. పావు గంట గడిచిన తరువాత బయటకు వచ్చాడతను. దిక్కులు చూస్తూ వేగంగా డెక్ మధ్యభాగానికి పోసాగాడు.

"మిస్టర్... స్టాండ్ వేర్ యూవార్. కదిలితే కాల్చి పారేస్తాను" సిగరెట్ కింద పడవేసి బెల్టు వెనుకవున్న రివాల్వర్ మీద చెయ్యివేస్తూ అరిచాడు షాడో.

ఎందుకో అతని హృదయం కీడును శంకించింది. ప్రమాదాలను ముందుగానే గుర్తించి హెచ్చరికలను పంపడానికి అలవాటుపడ్డ అతని సిక్స్‌త్ సెన్స్ డేంజర్ సిగ్నల్స్‌ని ప్రసారం చేసింది.

ముందు వ్యక్తి ఆగలేదు. మరింత వేగంగా అడుగులు వేస్తూ, లోడింగ్ ఎపార్ట్‌మెంట్‌ల వైపు పరుగు తీసాడు.

బాణంలా అతనిని అనుసరించాడు షాడో. ఒక్కసారిగా గాలిలోకి డైవ్ చేసి అతని నడుముమీద తన్నాడు.

తన్నుతూ వుండగానే ఏదో పొరపాటు జరిగిందన్న విషయం అర్థమైంది. కండరాలను బిగించి చేతుల్ని కరాటే ఫైటింగ్ పొజిషన్‌లోకి తీసుకు రాబోతుండగా... పడింది మెడమీద బలమైన దెబ్బ.

కళ్ళ ముందు ఇంద్రధనుసులు ప్రత్యక్షం అవుతుండగా పక్కకు దూకాడు షాడో. కంటికి కనిపించిన రెండు ఆకారాల్ని పొట్టలో పొడిచి, క్రింద పడేశాడు.

మరోసారి పడింది రెండవ దెబ్బ.

గిర్రున వెనుతిరిగి చేతిని గాలిలోకి ఎత్తాడు షాడో. భయంకరమైన కరాటే సింహనాదం అతని నోటి నుంచి వెలువడక ముందే పడింది మూడవ దెబ్బ.

మెడ ఎముకలు విరిగిపోయినంత బాధ కలుగుతుండగా స్పృహ తప్పి నేల వాలిపోయాడు షాడో.

***

"వాసూ... రాజు ఎక్కడ వున్నాడు? స్కౌటింగ్ ప్లేస్‌లో ఎవరూ లేరు!?" అంటూ ఇంజన్ రూమ్‌లోకి వచ్చాడు కాప్టన్ టోని. బాగా తాగి వుండటంవల్ల కళ్ళు ఎర్రబడి వున్నాయి. విపరీతంగా ఆలోచించడంవల్ల ముఖమంతా పీక్కుపోయింది.

కావేరి విద్యుత్తును సరఫరా చేసే డైనమో నొకదాన్ని పరీక్షిస్తున్నాడువాసు. ఆ మాటలతో వులిక్కిపడి టోని వంక చూశాడు.

"యస్... ఐ వార్న్ డ్ దట్ ఇడియట్, జాగ్రత్తగా వుండమని చిలక్కి చెప్పినట్లు చెప్పాను. చూడు ఏం జరిగిందో?" అంటున్నాడు అతను. ఆపైన అతని మాటలను వినిపించుకోలేదు వాసు. టూల్ రూమ్ లోకి పరుగుతీశాడు. రెండు మూరల పొడుగున్న రెంచిని తీసికొని లాడర్ మీదుగా డెక్ మీదికి వచ్చాడు. పరుగులాంటి నడకతో ప్రతి మూలను వెదకసాగాడు.

వాసు సి.ఐ.బి. సెక్యూరిటీ ఫోర్స్ కాప్టెన్ ఆరడుగుల మూడు అంగుళాలకు పైనే వుంటుంది అతని ఎత్తు. నలభై అంగుళాల చాతీ... అతను నడుస్తుంటేచిన్న పర్వతం కదిలినట్లు అనిపిస్తుంది

కులకర్ణిగారు హెచ్చరించినట్లే అయిందన్న భయంతో షాడో కోసం వెతకసాగాడు. ప్రయాణీకులు వుండే కాబిన్స్ పైన గాంగ్ వే ఒకటి వుంది. దానికి డెక్ చివరి భాగానికి మధ్య నాలుగు అడుగుల సన్నటి సందు వున్నది.

రెంచిని వూపుతూ ఆ సందులోకి పోయాడు వాసు. అప్పుడే షాడోను టార్పాలిన్‌లో వుండగా చుట్టి నీటిలోకి విసరబోతున్నాయి రెండు ఆకారాలు.

వాసును చూడగానే నిశ్శబ్దంగా వచ్చి మీద పడ్డాయి. రెంచిని గాలిలో వూపాడు వాసు. ఒక ఆకారం ఎగిరి అవతల పడింది. రెండవదాన్ని ఎడమచేతితో పట్టుకొని ఎత్తి డెక్ చివర వున్న ఇనుప కమ్ములకేసి బాదాడు.

బంతిలా ఎగిరి కమ్ముల మీదగుండా నీటిలోకి దొర్లింది అతని శరీరం. ఆఖరి క్షణంలో అరిచిన అరుపు ఇంజన్ మోతతో కలసిపోయింది. వెంటనే క్రింద పడిన మొదటి వ్యక్తి వైపు చూశాడు వాసు.

మరుక్షణం స్ప్రింగ్ లాగా లేచి నిలబడ్డాడతను. వాసు తనను సమీపించేలోగా రెండు అడుగులు ముందుకువేసి ఇనుక కమ్ముల మీద గుండా సముద్రంలోకి దూకేశాడు.

రెంచిని అవతలకు విసిరి నేలమీద వున్న టార్పాలిన్ చుట్టను విడదీశాడు వాసు. షాడోని గుర్తుపట్టి అచేతనుడై పోయాడు. క్షణంలో తెలివి తెచ్చుకొని గుండెలమీద చెయ్యివేశాడు. కొట్టుకుంటూనే వుంది హార్టు. ఉచ్ఛ్వాస నిశ్వాసలు మాత్రం కొంచెం బరువుగా నడుస్తున్నాయి

పదేళ్ళ బాలుణ్ని ఎత్తినట్లు ఎత్తి భుజం మీద వేసుకొని ఇంజన్ రూమ్ దగ్గరికి పరుగెత్తు కుపోయాడు వాసు.

దారిలో ఎదురు వచ్చాడు టోని. షాడోని ఆ పరిస్థితిలో చూడగానే అతని మత్తు దిగిపోయింది. ఒక్కఅడుగు వెనక్కి వేసి ఇంజన్ రూమ్ ద్వారంలోవున్న ఫోన్ అందుకున్నాడు.

"హల్లో" అంటూ సమాధానం యిచ్చాడు కునికిపాట్లు పడుతున్న టెలిఫోన్ ఆపరేటర్. "కాల్ ది డాక్టర్ యు బ్లడీ స్లీపింగ్ ఇడియట్! ఆస్క్ దట్ బ్లడీ డాక్టర్ టు హర్రీ అఫ్... " అని అరిచాడు కాప్టన్ టోని.

అర నిముషంలో డెక్ మీద ప్రత్యక్షమయ్యాడు డాక్టర్ శర్మ. స్ట్రెచ్చెర్ తెప్పించి దానిమీద షాడోని తన క్లినిక్ లోకి తీసుకుపోయాడు. తల మీద దెబ్బకు బాండేజి వేశాడు. ఏవో ఇంజక్షన్స్ వేశాడు. "డోంట్ వర్రీ కాప్టన్. రేపు యీ పాటికి కులాసా చిక్కుతుంది. కాస్త మెడ అటూ యిటూ కదల్చకుండా జాగ్రత్తపడాలి అంతే" ఒక ప్లాస్టర్గుడ్డను మెడకు చుట్టాడు

అదే స్ట్రెచ్చెర్మీద తన కాబిన్లోకి తీసుకుపోబడ్డాడు

***

ఎవరో గొంతు పిసుకుతున్నట్లు అనిపించి కళ్లు తెరిచాడు షాడో. ముఖమంతా చెమటలతో నిండి పోయింది. ఆయాసంతో ఎగసెగసి పడుతున్నాయి గుండెలు.

తను రివాల్వర్ తీసి పారిపోతున్న వ్యక్తిని ఆపటానికి ప్రయత్నించటం వరకే గుర్తుందతనికి. అవతల ఏమైందో తను బెడ్ మీదికి ఎలా వచ్చాడో అర్థం కాలేదు. లేచి కూర్చోవటానికి ప్రయత్నించాడు. శిరస్సు పగిలిపోతున్నట్లు బాధ రేగింది. దానికితోడు మెడ బిగుసుకు పోయినట్లు పక్కకు కదలటం లేదు.

"ఖర్మరా బాబూ..." అనుకుంటూ లేచే ప్రయత్నం మాని వెనక్కువాలి పడుకున్నాడు.

ద్వారం దగ్గిర చప్పుడు అయింది. తలతిప్పి చూడటానికి ప్రయత్నించాడు, బాధతో కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

"ఎలా వుంది రాజు... బాధగా వుందా?" అంటూ లోపలికి వచ్చింది సీమ.

మంచం మీద కూర్చుని నుదుటి మీద చెయ్యి వేసి చూసింది.

"రాత్రి జరిగిన విషయం నాకు కాప్టన్ టోని చెప్పాడు రాజు... ఎందుకు అటువంటి ప్రమాదాలలో తల దూరుస్తావ్?" అని అడిగింది.

సమాధానంగా చిరునవ్వు నవ్వాడు షాడో.

"సాయంత్రం పార్టీకి నువ్వు రావచ్చని పర్మిషన్ ఇచ్చాడు డాక్టర్. రాకుండా ఎగకొడతావేమో అని వచ్చాను." అన్నది సీమ.

పార్టీ పేరు వినగానే మెరుపు మెరిసినట్లు ఒక ఐడియా ఫారం అయింది షాడో హృదయంలో.

"సీమా... నాకో సహాయం చేస్తావా?" అని అడిగాడు వెంటనే.

సీమ కళ్ళు మెరిశాయ్ వింతగా. "చెప్పు రాజు... ఏం చెయ్యాలి?" అన్నది.

"ఏమీ లేదు... మీ ఫాదర్‌తో తప్ప యీ విషయం యింకెవరితోనూ చెప్పకూడదు తెల్సిందా?"

"నా మీద ఆ మాత్రం నమ్మకం లేదా?"

"వుంది కాబట్టే చెప్తున్నాను చూడు... ఈ రాత్రికి ఎలాగైనా సరే విక్టర్ రూమ్‌లో నుంచి ఆ ముసలాణ్ని పార్టీకి పిలిపించాలి. ఒక గంట పాటు గదికి తిరిగి పోనీయకుండా ఆపాలి."

"ఓస్.. ఇంతేగదా! నిముషాల మీద అరేంజి చేస్తాను" నమ్మకంగా అన్నది సీమ.

ఆ మాటతో ముందు చేయవలసిన పనులను గూర్చిన ఆలోచనలతో మునిగిపోయాడు షాడో.

"డూ యిట్ గర్ల్... అంతా నీ మీద ఆధారపడి వుంది" అన్నాడు యాథాలాపంగా ఆమె భుజం తడుతూ.

షాడో చెయ్యి పైకి లేవగానే ఇంకేదో వూహించుకున్నదామె. చిన్న పిల్లను మెచ్చుకున్నట్లు భుజం తట్టటంతో కోపగించుకున్నది. పెదవులు బిగించి, కాలితో నేలను గట్టిగా తన్ని నిలబడింది.

ఆశ్చర్యంగా చూశాడు షాడో. అతని బెడ్ పక్కనే వున్న టీపాయ్ మీద గ్లాసులో నీళ్ళు పెట్టి వున్నాయి. ఆ నీళ్ళ గ్లాసు తీసి అతని ముఖం మీద కుమ్మరించి, విసవిసా నడుస్తూ వెళ్ళిపోయింది సీమ. తను ఏం చేసినందుకు ఆ బహుమతి లభించిందో అర్థం చేసుకోలేక పోయాడు షాడో. ఆలోచిద్దామంటే తలనొప్పి ఒక పెద్ద ఆటంకమయి కూర్చున్నది.

***

ఆరుగంటలకల్లా టంచన్‌గా ఆరంభమయింది మిసెస్ జయరాం ప్రసాద్ బర్త్ డే పార్టీ.

"హల్లో మిస్టర్ రాజూ... ఏమిటీ అవతారం? ఒక మూలగా నిలబడి పార్టీ గందరగోళాన్ని పరికిస్తున్న షాడో భుజంమీద చెయ్యివేసి పలుకరించాడు విక్టర్.

"ఏం సార్? ఎక్కడైనా పడ్డారా?" అన్నాడు నెపోలియన్.

నవ్వుతూ వారి ప్రశ్నకు తగినట్లే సమాధానం యిచ్చి అక్కడినుంచి తప్పుకున్నాడు షాడో. ఒక చివరగా నిలబడి పార్టీలో పాల్గొంటున్న వారందర్నీ పరీక్షించాడు.

విక్టర్ అంకుల్ వీల్ ఛైర్లో కూర్చుని బ్రాందీ గ్లాసు పట్టుకొని పెద్దగా నవ్వుతున్నాడు. అతని ఎదురుగా నిలబడి కబుర్లు చెపుతున్నది సీమ.

"రాజు... హౌ ఆర్ యూ..." అంటూ అతన్ని సమీపించాడు జయరాం ప్రసాద్. ఆయన మిసెస్ కూడా వెనుకనే వచ్చింది.

"మెనీ హ్యాపీ రిటర్న్స్ మేడమ్" అన్నాడు షాడో.

అందంగా నవ్విందామె. మరుక్షణం సీరియస్‌గా చూసింది.

"రాజు... మా శ్రీవారు ఆఫర్ చేసిన జాబ్‌ను గురించి ఆలోచించావా?" అని అడిగింది సడన్‌గా.

"మీరు నా మీద చూపిస్తున్న అభిమానానికి ఏవిధంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలో నాకు అర్థం కావటంలేదు. కాని మీ ఆఫర్‌ని కాదంటున్నందుకు క్షమించండి" అన్నాడు షాడో. తరువాత రాబోయే మాటలకు సమాధానం సిద్ధం చేసుకుంటూ అతను అనుకున్నట్లు కోపంగా చూడలేదు దంపతులు. ఒకరి వంక ఒకరు చూసుకొని నవ్వుకున్నారు.

"ఇటీజ్ ఆల్ రైట్ రాజు... ఏ విషయమైనా చెప్పే వాళ్ళు చెపితే గాని అర్థం కాదు" అన్నాడు జయరాం ప్రసాద్.

గుటకలు మింగాడు షాడో, ఆ మాటలను ఏ విధంగా అర్థం చేసుకోవాలో తెలియక.

"వెల్ రాజూ... ఇంకా ఇక్కడే వున్నావా? టైం అయింది ఇక పో" అంటూ వచ్చి వారిని కలుసుకున్నాడు కాప్టన్ టోనీ.

"అదేమిటి? ఇప్పుడు ఎక్కడికి పోతాడు?" ఆశ్చర్యంగా అడిగింది మిసెస్ జయరాం ప్రసాద్.

"ఇంకెక్కడికి మేడమ్? చీఫ్ ఆఫీసర్ పోవాల్సిన చోటికి స్కాటింగ్ ప్లేస్‌కి," గట్టిగా అన్నాడు టోని అందరికీ వినిపించేటట్లు.

చుట్టుపక్కల వున్న వారందరూ వింతగా చూసి తలలు తిప్పుకున్నారు. పార్టీ యిచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుకొని డ్యూటీ అటెండ్ కావటానికి పోయాడు షాడో.

* * *

ప్రకాశవంతమైన బల్బులతో పట్టపగలుగా వుంది ప్రయాణీకుల కాబిన్స్ వున్న కారిడార్. డ్యూటీకి పోతున్నానని చెప్పి సరాసరి కాప్టన్ టోనీ కాబిన్‌కి వెళ్ళాడు షాడో. అతను టేబిల్ మీద పెట్టి వుంచిన డూప్లికేట్ తాళం చెవులను తీసుకొని ఆ కారిడార్ లోకి వచ్చాడు.

విక్టర్, నెపోలియన్‌లు వుండే కాబిన్ తలుపులు తెరిచి లోపలికి పోయి లైట్ వేశాడు. నీట్‌గా వున్నది గది. ఎక్కడి సామాను అక్కడే అందంగా అమర్చబడివున్నాయి.

ఒక మూల నుంచి ప్రారంభించి... గదినంత క్లియర్‌గా పరిశోధించాడు షాడో. బెడ్ క్రింద, పరుపుల క్రింద పిల్లోల వెనుక... అన్ని ప్రదేశాలను చూశా విక్టర్ మీద అనుమానం కలిగించే ఆధారాలు ఏవీ కనిపించలేదు.

కనిపించకపోతే ఎలా? ఆధారాలు కావాలి ఖచ్చితంగా. ఆఖరి సారిగా గదినంతా చెక్ చేసి ఎటాచ్ బాత్ రూమ్ లోకి తొంగిచూశాడు.

పార్టీకి బయలుదేరే ముందు ట్రిమ్‌గా డ్రసప్ అయ్యారు విక్టర్, నెపోలియన్‌లు. కనీసం యిద్దరూ కలిసి చెరొక సోప్‌ని ఖతం చేసినట్లున్నారు బాత్ రూమ్ సోప్ వాసనతో దద్దరిల్లి పోతున్నది.

వెనుతిరగబోతున్న షాడో అంతరంగం ఆ సోప్ వాసన మీదినుంచి వస్తున్న మరో వింతవాసనను పసికట్టింది వెంటనే వెనుతిరిగే ఆలోచనను విరమించుకుని ఆ గదిని వెతికాడు.

బాత్ టబ్ వెనుకగా దాచబడి వుంది... ఆ వాసనకు కారణభూతమైన స్పిరిట్ గమ్. దాని ప్రక్కనే వున్న అట్టపెట్టిలో పెట్టుడు గడ్డాలకు, మీసాలకు వుపయోగించే వెంట్రుకలు కనిపించాయి.

ఆ రెంటినీ కోటుజేబులో వేసుకొని వెనుతిరిగాడు షాడో. లైటు ఆర్పి గదికి తాళం వేశాడు. పనామా వెలిగించుకొని నెమ్మదిగా అడుగులు వేస్తూ పార్టీ నడుస్తున్న మెస్ హాల్‌ని సమీపించాడు.

ఫుల్ స్వింగ్‌లో నడుస్తున్నది పార్టీ. నవ్వులు శృతులకు మించి వినిపిస్తున్నాయి సీమ యింకా విక్టర్ అంకుల్‌తో మాట్లాడుతూనేవున్నది. పనామా వెలిగించుకొని లోనికి అడుగుపెట్టాడు షాడో.

దూరంగా నిలబడివున్న కాప్టెన్ టోనీ అతన్ని చూడగానే గది మూలకు జరిగాడు. బార్ దగ్గర వున్న వాసు మెల్లిగా సీమ వెనక్కి చేరుకున్నాడు.

విక్టర్ నెపోలియన్‌లు యిద్దరూ ఒక టేబిల్ ముందు కూర్చుని వున్నారు. ఇద్దరి చేతుల్లోనూ బ్రాందీ గ్లాసులున్నాయి. సరాసరి వారి టేబిల్ దగ్గరికి పోయాడు షాడో. కోటు జేబులో వున్న వస్తువుల్ని తీసి వారి ముందు పెట్టాడు.

ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్లు ఉలిక్కిపడ్డారు వారిద్దరూ. ఒక్కసారిగా లేచి నిలబడ్డారు.

సీమ వెనుక నిలబడి వున్నాడు వాసు. ఎడమ చేతితో ఆమెను యివతలికి లాగి ఒక్క గంతులో వృద్ధుడి ముందుకు పోయాడు.

అంతవరకూ నవ్వులతో హోరెత్తి పోతున్న హాలు ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది. వృద్ధుడి పక్కన వున్న నర్సులతో ఒకామె హేండ్ బాగ్ లో చేయి పెట్టింది.

దూరంగా నిలబడిన కాప్టెన్ టోనీ చేతిలో ప్రత్యక్షమయింది 44 కాలిబర్ రివాల్వర్. నిశ్శబ్దాన్ని చేదిస్తూ గర్జించిదొకసారి, బాగ్‌ని వదిలి చెయ్యి పట్టుకొని కూలబడింది ఒక నర్సు.

జయరామ్ ప్రసాద్, సీమ, ఆమె తల్లి, మిగిలిన ప్రయాణీకులు అందరూ నోళ్ళు తెరుచుకొని చూస్తున్నారు

పాంటు జేబులో చెయ్యి పెట్టబోయాడు నెపోలియన్. మెరుపులా ప్రత్యక్షమయింది షాడో చేతుల్లో ఒక రివాల్వర్.

"కావేరిలోని వర్కర్లు నీకు గాని, నీ గాంగ్ లోని వారికి గాని ఎటువంటి ద్రోహము చేయలేదు. అయినా మా మధ్య తిరుగుతున్న ముగ్గుర్ని మీ పొట్టన పెట్టుకున్నారు. ఇక మీ ఆటలు కట్టాయి. చెప్పు... నీ అనుచరులు ఇంకా ఎవరెవరు వున్నారు, ఎక్కడ వున్నారు?" అన్నాడు షాడో రివాల్వర్‌ని అతని గుండెలకు గురిపెడుతూ.

"నువ్వు అంటున్నదేమిటో మాకు అర్థం కావటంలేదు. మీ వారిని చంపటంలో మాకు ఎటువంటి సంబంధమూ లేదు..."అంటూనే చేతిని టేబిల్ మీద వున్న బ్రాందీ గ్లాసువైపు పోనిస్తున్నాడు విక్టర్.

కాప్టెన్ టోనీ చేతిలోని రివాల్వర్ భయంకరంగా గర్జించింది. బ్రాంది గ్లాసు ముక్కలు ముక్కలైపోయింది. కొన్ని పెంకులు విక్టర్ చేతిని గాయపరిచాయి.

"వాసూ! ఆ ముసలి అంకుల్ ని యువతలకు లాగు..." రివాల్వర్‌తో నెపోలియన్‌ని కవర్ చేస్తూ అన్నాడు షాడో.

ఒక్క గంతులో వీల్ చైర్‌ని సమీపించాడు వాసు.

అడ్డు రాబోయిన నర్సును ఎత్తి నేలకేసి కొట్టాడు. వెంటవున్న హేండ్ బ్యాగ్‌లో చేయిపెట్టబోయింది రెండవ నర్సు.

భయంకరంగా గర్జించింది టోనీ చేతిలోని రివాల్వర్. "ఖబడ్దార్! కళ్లు కదిలించటానికి కూడా ట్రై చేయకండి. నంచుకు తింటాను..." పట్టరాని కోపంతో పళ్ళు కొరుకుతూ హెచ్చరించాడతను.

నోరు తెరుచుకొని చూస్తున్న వృద్ధుడి గడ్డాన్ని పట్టుకొని బలంగా గుంజాడు వాసు. స్పిరిట్ గమ్‌తో అతికించింది కావటంవల్ల వెంటనే వూడి వాసు చేతిలోకి వచ్చిందా పెట్టుడు గడ్డం.

ఆ గడ్డం వెనుక కనిపించిన ముఖాన్ని చూసి నిర్ఘాంతపోయారు కావేరి ప్రయాణీకులు అందరూ.

ఏ సైంటిస్ట్ కోసం సౌత్ ఆఫ్రికన్ మిలటరీ అధికారులు కావేరిని రెండుసార్లు చెక్ చేశారో ఆ సైంటిస్టే అతను. మిస్టర్ మోర్గాన్.

"వెల్ డన్ మిస్టర్ విక్టర్! ముసలి వేషం వేసి, కదలలేని వాడని చెప్పి నేర్పుగా మా కళ్ళు కప్పావ్. హేట్సాప్ టు యువర్ ప్లానింగ్.." విక్టర్ వంక చూస్తూ అన్నాడు షాడో.

అదే సమయంలో ఒక్కసారిగా షాడో మీదికి జంప్ చేశాడు నెపోలియన్. కనుచివరల నుంచి ఆ కదలికను కనిపెట్టాడు షాడో. ఒక అడుగు వెనక్కి వేసి రివాల్వర్ మడమతో అతని గడ్డం క్రింద పొడిచాడు.

కెవ్వున అరిచి వెల్లికిలా పడ్డాడు నెపోలియన్. లేవటానికి ప్రయత్నిస్తుండగాలాగిపెట్టి తొడలమీద తన్నాడు వాసు.

"విక్టర్! ఒంటరిగా రాలేదు నువ్వు. నీ రాక్షస కృత్యాలకు ఎవరో చేయి అందించి సాయపడుతున్నారు. ఎవరు వారు? ఎక్కడ వున్నారు?" అంటూ విక్టర్ వైపు కదిలాడు షాడో.

"రాజు, నువ్వు మిగిలినవారి సంగతి చూసుకో. మన వాళ్ళందర్నీ హెచ్చరించి కావేరిని వెనక్కు తిప్పించు... ఈ దుర్మార్గుల్ని కల్హారీ పోలీసులకు వప్ప చెప్పాలి..." అంటూ విక్టర్ మెడమీద చరిచి... అతని చొక్కా పట్టుకున్నాడు కాప్టన్ టోనీ.

"దుర్మార్గుడా... నా నౌక ప్రిస్టేజిని పాడుచేయటానికి ప్రయత్నిస్తావా? కత్తుల్లాంటినా అనుచరుల్ని నీ పొట్టన పెట్టుకుంటావా!!" అంటూ అతన్ని ఒక గోడకేసి కొట్టటం ప్రారంభించాడు- మట్టి కొట్టుకున్న కార్పెట్‌ని గోడకేసి విదిలిస్తున్నట్లు

ఈ లోపల వాసు చేతులు వూరికే వుండ లేదు. క్రింద పడిన నర్సుల వంక సీరియస్‌గా చూస్తూ వారి బాబ్డ్ హెయిర్‌ని పట్టుకొని గట్టిగా గుంజాడు.

మోర్గాన్ గడ్డం మాదిరిగానే వూడి వచ్చాయవి. సమ్మర్ క్రాప్ చేసిన బోడితలలు బయట పడ్డాయి

"జంటిల్మన్ మీరందరూ మీమీ కాబిన్స్‌కి వెళ్ళండి. మేము చెప్పేదాకా దయచేసి బయటకు రాకండి..."

అంటూ ప్రయాణీకులను హెచ్చరిస్తూ, వారిద్దరినీ ఒక గోడకేసి ఆనించి నిలబెట్టాడు షాడో.

"వాసూ! పోయి ఇంజన్ రూమ్ లోని వారిని హెచ్చరించు. వుయార్ గోయింగ్ బాక్" అంటూ మోర్గాన్ మెడ పట్టుకొని వీల్ ఛైర్‌లో నుంచి యివతలికి లాగాడు.

అదే సమయంలో మెస్ హాల్ చివర వున్న ఒక చిన్న ద్వారం వైపు చూసి కెవ్వున అరిచింది సీమ.

ఉలిక్కిపడి అటు చూశాడు షాడో.

మిషన్ గన్స్ పట్టుకొని ఒకరితరువాత ఒకరుగా మెస్ హాల్ లోకి వస్తున్నారునల్లటి దుస్తులుధరించిన దృఢకాయులు అనేకమంది.

"ఫైర్!" ఉన్నట్లుండి అరిచాడు నేలమీద వున్న నెపోలియన్. ఎగిరి అతని గుండెలమీద దూకాడు వాసు.

అంతటితో అక్కడ ఆవరించుకోబోతున్న ప్రశాంతత దూరంగా పారిపోయింది. నెపోలియన్ నోటినుంచి మాట వెలువడిన మరుక్షణం, ఫైరింగ్ ఓపెన్ చేశారు ఆ దృఢకాయులు.

చెవి ప్రక్కనుంచి దూసుకుపోతున్న బుల్లెట్లను లెక్క చెయ్యకుండా ఎగిరి, ఛైర్ చాటుకు జంప్ చేశాడు షాడో. రివాల్వర్ ఎత్తి ట్రిగ్గర్ నొక్కాడు.

కెవ్వున అరిచి క్రింద పడ్డారుయిద్దరు.

"పడకొట్టండి... ఈ బాస్టర్డ్‌ని పడకొట్టండి..." అని అరిచాడు విక్టర్... కాప్టన్ టోనీ గుండెలమీద తలతో పొడుస్తూ.

వెనక్కు తూలాడు కాప్టన్ టోనీ, "రాజూ! నీకు ఫుల్ పవర్స్ యిస్తున్నాను నరికేయ్ వీళ్ళందర్నీ, మిగిలిన విషయాలను నేను చూసుకుంటాను" అంటూ రివాల్వర్‌ని విక్టర్ గుండెల కేసి గురిపెట్టాడు కాప్టన్ టోనీ.

అతని రివాల్వర్ ప్రేలక ముందే దృఢకాయుల మిషన్ గన్స్ అతని వైపు తిరిగాయి. 'ధనా ధన్' మని మ్రోతలు చేస్తూ పోయి అతని గుండెల్లో దిగబడ్డాయి రెండు బుల్లెట్లు పళ్ళ బిగువున బాధను భరిస్తూ నేలమీద పడ్డాడుకాప్టన్ టోనీ.

చీమల పుట్టలో నుంచి బయటికి వచ్చినట్లు గా మెస్ హాలులోనికి వచ్చి రాజును, వాసును చుట్టుముట్టబోతున్న ద్రోహులను చూడగానే అతని ఆవేశానికి అంతు లేకపోయింది. అతి ప్రయత్నంమీద రివాల్వర్‌ని అటు తిప్పాడు.

ఫట్ మని పడిందొక దెబ్బ. నెపోలియన్ బూటు కాలు అతని పెదిమలను చీల్చి నెత్తు ర్ని కళ్ళచూసింది.

అప్పటికి ఆరుగుర్ని పడకొట్టాడు షాడో. దగ్గ రికి వస్తు న్నవారిని గమనించి, రివాల్వర్‌ని ఎత్తి వాళ్ళ ముఖాల మీదికి విసిరి, చేతికి అందిన ఛైర్‌ని గాలిలోకి లేపాడు.

"ఫైర్" మరోసారి అరిచాడు నెపోలియన్.

ఒక టేబిల్ చాటున మంచి పొజిషన్ చూసుకున్నాడు వాసు. ఆ మాట వినగానే రెండు అంగల్లో వచ్చి షాడోకు అడ్డంగా నిలబడ్డా డు

"ధనాధన్" మని గర్జించింది ఒక మిషన్ గన్.

రెండు బుల్లె ట్లువాసు ఎడమ తొడలమీద దిగబడ్డా యి మరో రెండు షాడో కుడికాలులో దిగబడ్డా యి

అంతవరకూ ఒక ప్రక్కగా వున్న విక్టర్, ఒక ఛైర్‌ని ఎత్తి వారిద్దరి మీదికి విసిరేశాడు.

గట్టు తెగిన వరదలా వచ్చి వారిద్దరిని చుట్టు ముట్టారు మిషన్ గన్స్ పట్టుకున్న దృఢకాయులు... వారిని ఎదిరించాలని సాధ్యమైనంతవరకూ ప్రయత్నించారు షాడో, వాసు.

ప్రయోజనం లేకపోయింది... స్పృహతప్పి నేలమీదికి జారిపోయారిద్దరూ ఒకేసారి.

***

పొగ క్లియర్ అయిపోయింది. మెల్లిగా కళ్ళు తెరిచి చూశాడు షాడో. ఒక్కసారిగా మైకపు తెరలు అతన్ని వివశుణ్ణి చేశాయి. తిరిగి కళ్ళు మూసుకున్నాడు. బార్ రూమ్ నిశ్శబ్దంగా వున్నది. బయట నుంచి ఏవో మాటలు వినవస్తున్నాయి

మళ్ళీ కళ్ళు తెరిచాడు. కుడి కాలు తొడమీద ఎర్రటి ఇనుప కణం పెట్టినట్లు బాధ కలుగుతున్నది. తల కొంచెం పైకి ఎత్తి కాలు చూసుకున్నాడు. కాలంతా రక్తమయం. ఒక బుల్లెట్ తొడలోనుంచి దూసుకుపోయింది. జరిగింది గుర్తుకువచ్చి చుట్టూ చూశాడు.

ప్రయాణీకులు అందరూ ఫైటింగ్ మొదలైన మరుక్షణం ప్రక్కలకి దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. మెషిన్ గన్స్‌కు ఎదురు నిలబడి వున్న షాడో, టోనీ, వాసుల మీద జరిగి ఫైరింగ్ అంతా.

రెండు బుల్లెట్లు ఊపిరి తిత్తుల పక్కగా దూసుకు పోవటంతో పెద్ద రక్తపు మడుగులో పడివున్నాడు టోనీ. వాసుకు కూడా కుడి కాలు రక్తసిక్తమై వుంది. అతనూ స్పృహలో లేడు.

మెషీన్ గన్స్ పట్టుకున్న వ్యక్తులు కొందరు ప్రయాణీకులను దూరంగా గోడలకు ఆనించి నిలబెట్టి వుంచారు. వారందరూ కిందవున్న వారినే చూసుకున్నారు. సీమ ముఖంలో ప్రతిబింబిస్తున్న భావాలను చూసి కలవరం చెందాడు షాడో.. తను ఎంత వద్దనుకున్నా క్షణక్షణానికి తనకు మరింత చేరువ అవుతున్నదామె.

బూట్లు టకటక లాడించుకుంటూ లోపలికి వచ్చాడు విక్టర్. షాడో కళ్ళు తెరిచి వుండటం చూసి పెద్దగా నవ్వి దగ్గరికి వచ్చాడు.

"హల్లో రాజు... నీది ఉక్కు శరీరం సుమా... నిన్ను అవుటాఫ్ ఆర్డర్‌లో పెడదామంటే చేత కాకపోయె" అన్నాడు వ్యంగ్యంగా.

"మిస్టర్ విక్టర్. నీ మాటలు నెమ్మదిగా వింటాను గాని ముందు మా డాక్టర్ ని పిలిపించు. నా కాలు విరిగింది, టోని పరిస్థితి సీరియస్‌గా ఉన్నట్లుంది" అన్నాడు.

"మీ డాక్టర్ కావేరిని వశపరుచుకోవటంలో గాయపడిన నా అనుచరులకు ట్రీట్‌మెంట్ ఇస్తున్నాడు అది అవగానే పిలిపిస్తా."

"ఈ లోపల కాప్టన్ గతి!"

"అది అతనికి తెలియాల్సిందే. మా వాళ్ళు అందరూ కట్లు కట్టించుకోనిదే డాక్టర్ ఇక్కడికి రాడు" ఖండితంగా అన్నాడు విక్టర్.

"అయితే షిప్ అంతా నీ స్వాధీనంలోకి వచ్చిందన్న మాట. మరి మా వర్కర్లు!"

కాలి బాధ తగ్గటానికి ఏదో ఒకటి మాట్లాడుతూ ఆ సంగతిని మర్చిపోవటమే సరైన మందు అనుకొని అడిగాడు షాడో.

"మీ వాళ్ళకు వచ్చిన భయం ఏమీలేదు. ఎటువంటి గొడవా చేయకుండా చెప్పినట్లు వింటే ఎవరికీ ఎటువంటి అపకారమూ జరగదు" అని ప్రయాణీకుల వైపు తిరిగాడు విక్టర్

"అనుకోని విధంగా శ్రమ కలిగించాల్సి వచ్చింది. ఐయామ్ వెరీ సారీ. నేను అన్న మాటలు మీకు కూడా వర్తిస్తాయి ఎటువంటి తగాదా చేయకండి. క్షేమంగా మీ దేశాలకు చేరుకోగలరు. ఎదురు తిరిగారో... సముద్ర జీవాలకు ఆహారం అవుతారు" అని హెచ్చరించాడు.

"ఇదంతా ఎందుకు చేస్తున్నట్లు విక్టర్? మీరు విప్లవకారులే అయితే కావేరిని దొంగిలించటంవల్ల ప్రయోజనం ఏముంది? ఇటువంటి నౌకలు మీకు చాలా ఉన్నాయని విన్నాను?" అన్నాడు షాడో.

పెద్దగా నవ్వాడు విక్టర్. ఒక కుర్చీని తెచ్చుకొని షాడో ముందు వేసుకొని కూర్చున్నాడు.

"రాజు... రియల్లీ ఐలైక్ యూ. ఎందుకో నువ్వంటే నాకు అభిమానంగా ఉంది. మొదటి నుంచీ ఈ షిప్ మీద ఉన్న వారిలో మాకు కొరుకుడు పడని వాడివి నువ్వొక్కడివే. నీ తెలివితేటలు నేను చూశాను. నువ్వే ఆలోచించుకో" అన్నాడు.

"ఆలోచనల మాట దేవుడెరుగు. ముందు డాక్టర్ ని పిలిపించు. నా కాలు సర్వనాశనమయిపోయింది" గొణిగాడు షాడో.

మళ్లీ తెరలు తెరలుగా నవ్వాడు విక్టర్! అతని నవ్వు పూర్తి కాకుండానే అలసిపోయిన ముఖంతో అక్కడికి వచ్చాడు డాక్టర్ శర్మ. ముందు షాడో కాలును పరీక్షించాడు. డాక్టర్ చెయ్యిపడగానే పెద్దగా అరిచి నానా గొడవ చేశాడు షాడో.

"డాక్టర్... నాకు తెలుసు. నా తొడ ఎముక నజ్జునజ్జయిపోయింది. దయచేసి నాకు ఏదైనా మందు యిప్పించండి" అని వేడుకున్నాడు.

పజిల్ అయినట్లు ముఖంపెట్టాడు డాక్టర్ శర్మ. అతను మాట్లాడేలోగా.. పోయి కాప్టన్నీ, వాసునూ చూడమని హెచ్చరించాడు షాడో.

వారిద్దరినీ పరీక్షించి బాధగా నుదురు రుద్దుకున్నాడు డాక్టర్ శర్మ.

"మై డియర్ బాస్... వీరు ముగ్గురికీ వెంటనే ట్రీట్మెంట్ యివ్వాలి. నా క్లినిక్కి తీసుకుపోక తప్పదు" అన్నాడు విక్టర్ తో.

"తప్పకుండా డాక్టర్... వీళ్ళు కోరలు తీసిన పాములు. ఎక్కడున్నా మాకు ఓకే. అలాగే తీసుకుపోదాం" నవ్వుతూ అన్నాడు విక్టర్.

రెండు నిముషాలలో స్ట్రెచ్చర్స్ వచ్చాయి. షాడోను ఎత్తి దాని మీద పడుకోబెట్టారు ఆ కదలికకు కలిగిన నొప్పిని భరించలేక స్పృహ కోల్పోయాడు షాడో.

* * *

తిరిగి తొడమీద సూదులు పెట్టి పొడుస్తున్నంత బాధ కలిగితే గాని స్పృహ తెచ్చుకోలేక పోయాడు. కళ్ళు తెరవగానే మొదట కనిపించింది సీమ. తరువాత డాక్టర్ శర్మ ఆ తరువాత టేబిల్ మీద మెషిన్ గన్‌తో కూర్చుని సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తున్న విక్టర్ అనుచరుడు.

"డాక్టర్... కాప్టన్ ఎలా వున్నాడు? వాసుకు తెలివి వచ్చిందా?" అని అడిగాడు. అంతవరకూ అతనికి స్పృహ వచ్చినట్లు తెలుసుకోలేదు సీమ, డాక్టర్ శర్మలు, అదిరిపడి చేతుల్లో వున్న ట్రేను కింద పడవేసినంత పనిచేసింది సీమ. గాయాన్ని స్పిరిట్‌తో తుడుస్తున్న డాక్టర్ చిరాకుగా తల ఎత్తాడు "రాజు... నువ్వు చాలా వీక్‌గా వున్నావు. మాట్లాడకుండాపడుకో" అన్నాడు.

"టోని వాసుల కండిషన్ ఎలా వుంది?" మొండిగా అడిగాడు షాడో.

"డోన్ట్ డిస్టర్బ్ మీ మాన్. నువ్వే చూసుకో?" అని గాయాన్ని శుభ్రం చేయటంలో మునిగి పోయాడు డాక్టర్ శర్మ.

తల తిప్పాడు షాడో. పక్కనే వున్న బెడ్ మీద వున్న వాసు షాడో తనను చూడగానే నవ్వి చేయి వూపాడు. దెబ్బతిన్నది ఒక్క కాలే సార్. మిగిలిన బాడీ అంతా బాగానే వుంది" అన్నాడు.

తిరిగి గార్డ్ వైపు చూశాడు షాడో.

"హే... యూ... అగ్లీ... బాస్టర్డ్... మీ విక్టర్ ఎక్కడున్నాడు" అని ప్రశ్నించాడు.

"ఐ డోన్ట్ నో" ముక్తసరిగా వచ్చింది సమాధానం.

తాము మాట్లాడుకుంటున్న మాటలు అతను శ్రద్ధగా వింటూవుంటాడని గమనించాడు షాడో. విక్టర్ రాగానే టేప్ రికార్డ్‌లా ఒక్క ముక్కకూడా వదలిపెట్టకుండా అన్నిటిని వినిపించేస్తాడు

"డాక్టర్! మీరన్న మాటలు నిజమే. నాకు చాలా వీక్ గా వుంది. మాట్లాడటం చాలా కష్టంగా వుంది... అసలు మాటలే రావటంలేదు... నాకు... నా..." అంటూ పెద్దగా మూలిగి అటూ ఇటూ కొట్టుకున్నాడు. ఏదో చెప్పటానికి ప్రయత్నించాడు. గొంతు పెగలలేదు.

"రాజూ! ఏమయింది... భగవాన్!! రాజుకేమైంది." చేతిలోని ట్రేని అవతలకి విసిరేసి ఖంగారుగా షాడో తలను చేతుల్లో కితీసుకుంది సీమ.

హడావుడిగా వచ్చి నాడి చూశాడు డాక్టర్ శర్మ.

"డాక్టర్... డా...క్ట...ర్..." హీనస్వరంతో అస్పష్టంగా అన్నాడు షాడో.

చటుక్కున ముందుకు వంగి అతని నోటి దగ్గర చెవిని వుంచాడు శర్మ.

"డాక్టర్ మన మాటలన్నిటినీ విక్టర్ అనుచరుడు వింటున్నాడు. అందువల్ల ఇలా నటించాల్సి వచ్చింది. నాకాలు బాగానే వుంది. కాని, విరిగిపోయిందని చెప్పండి. అసలు నడవటానికి వీలులేదని హెచ్చరించి, చెక్కముక్కను వేసి పెద్ద బాండేజి కట్టండి... క్విక్" లోగొంతుకతో హెచ్చరించాడు షాడో.

అతి ప్రయత్నంమీద తనను తాను నిగ్రహించుకున్నాడు డాక్టర్ శర్మ. తన ఆశ్చర్యాన్ని ముఖంలో కనిపించకుండా దాచుకుంటూ, "సీమా.. లోపలికి పోయి క్లోరోఫారం యింజక్షన్ తీసుకురా... వెంటనే ఒక మైనర్ ఆపరేషన్ చేయాలి..." అన్నాడు సీరియస్ గా.

గబగబా లోపలికిపోయి చేతికి అందిన ఒక యింజక్షన్ బాటిల్‌ని తెచ్చి యిచ్చింది సీమ. దానిమీది లేబిల్ గార్డుకు కనిపించకుండా పట్టుకొని ఇంజక్షన్ చేసినట్లు సూదిని షాడో చేతికి ఆనించి... కష్టపడి పోతున్నట్లు ముఖం పెట్టాడు డాక్టర్ శర్మ.

"తొడ ఎముకలు డబుల్ ప్రాక్చర్ అయ్యాయి. కండరాలన్నీ తెగిపోయాయి. టిష్యూలు చిన్నాభిన్నం అయ్యాయి. బోలెడంత రక్తం వేస్ట్ అయింది... అసలు బ్రతికి బయట పడతాడనే నమ్మకం నాకు లేదు. బ్రతికినా లేచి నిలబడడు. లేచి నిలబడినా కుడికాలుని ఉపయోగించలేడు... ఉపయోగించినా..."

షాడో మెడమీద వెంట్రుకలన్నీ నిఠారుగా నిలబడ్డాయి ఆ కామెంట్స్ వినేసరికి. నోరంతా వేపాకు నమిలినట్లు చేదుగా తయారైంది. కాలు విరగలేదని తెలియకపోతే, నిజంగా ఆ మాటలు నమ్మాల్సి వచ్చేది.

కత్తెర్లను, కత్తుల్ని టాంటాంమనిపిస్తూ మైనర్ ఆపరేషన్ చేశాడు డాక్టర్ శర్మ. "నా పని నేను చేశాను. రాజుని యిక ఆ భగవంతుడే కాపాడాలి. ఇంకో రెండు గంటల్లో రక్తం ప్రసరణం ప్రారంభం అవుతుంది. ఆ ధాటికి కుట్లు తెగిపోవచ్చు. లేదా బ్లడ్ వెయిన్స్ మరోసారి కట్ కావచ్చు.. లేదా సెప్టిక్ కావచ్చు... నా డ్యూటీ నేను చేశాను. ఇక అతని అదృష్టం ఎలా వున్నదో!!" అంటూ పెద్ద పెద్ద బద్దలు వేసి కాలుకు బాండేజి కట్టాడు.

చెమటలు పట్టిన ముఖాన్ని సీమ వళ్ళో దాచుకొని, కను చివరల నుంచి విక్టర్ అనుచరుడి కేసి చూశాడు షాడో.

డాక్టర్ శర్మ కామెంట్స్ అతని కడుపులోని ప్రేగుల్ని మెలిపెడుతున్నాయి. కడుపులో తిప్పుతున్నట్లు ముఖంపెట్టి గోడవైపు తిరిగి కూర్చున్నాడు.

"ఎలా వుంది రాజు?" లో గొంతుకతో అడిగాడు డాక్టర్.

"మార్వలెస్ డాక్టర్... అసలు మీరు సినిమాల్లో చేరాల్సింది. మా ఖర్మ కొద్దీ డాక్టర్‌గా తయారయినారు..." అన్నాడు షాడో.

ఆ మాటలు అంటూండగానే తలుపులు తెరుచుకొని లోపలికి వచ్చాడు విక్టర్.

కళ్ళు మూసుకొని గట్టిగా మూలగటం ప్రారంభించాడు షాడో. అతను బెడ్ దగ్గరికి వచ్చి నిలబడటాన్ని గమనించి, బాధగా కళ్ళుతెరిచి... "విక్టర్... నీకు మతివుందా? ముందా గార్డుని బయటికి పంపు..." అని గద్దించాడు

"ఎందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు విక్టర్.

"ఎందుకా? చూడు... అవతల లంగ్స్ దెబ్బతిని పడివున్నాడు కాప్టన్ టోనీ... గది అంతా యిలా సిగరెట్ పొగతో నిండివుంటే... అతను ఏమైపోవాలి?" కోపంగా అన్నాడు షాడో.

అయోమయంగా డాక్టర్ శర్మవైపు చూశాడు విక్టర్. "హీ యీజ్ కరెక్ట్. లంగ్స్ దెబ్బతిన్న వారికి సిగిరెట్ పొగ పాయిజన్ లాంటిది" అన్నాడు డాక్టర్ శర్మ. ఆ మాట ఏ వైద్య గ్రంధంలో వ్రాసి వుందో గుర్తుకు తెచ్చుకోవటానికి విపరీతమైన ఆలోచన చేస్తూ.

అనుచరుడికి సైగచేశాడు విక్టర్. అతను తన సిగరెట్ పాకెట్, మిషన్ గన్‌లను, ఒక కుర్చీని వెంటబెట్టుకొని గది బయటికి పోయాడు. కుర్చీని గోడకు ఆనించి, సిగరెట్ వెలిగించుకుంటూ ద్వారం ముందే పీఠం వేశాడు.

"నీ కాలు విరిగినందుకు ఎంతో బాధ పడుతున్నాను రాజూ! నిన్ను ఉపయోగించుకుందామని చాలా ఆశపడ్డాను ఎనీవే... ఇటీజ్ ఆల్ రైట్. నావిగేటర్‌గా నీ తెలివి అమోఘమని చెప్పున్నారు మీ సిబ్బంది. ఐ వాంట్ యువర్ గైడెన్స్..." అంటూ పెద్ద మాప్ తెరిచి షాడో ముందు పరిచాడు విక్టర్.

"మన కావేరి యిప్పుడు పన్నెండు నాట్ల వేగంతో ముప్పై డిగ్రీలు దక్షిణంగా ప్రయాణిస్తోంది మనకు ఆరు వందల మైళ్ళ దూరంలో, నలభై మూడు డిగ్రీల ఆపోజిట్‌గా, గంటకు పదిహేను నాట్ల వేగంతో వస్తోంది ప్రిన్సెస్ అనే ఆస్ట్రేలియన్ నౌక. దాన్ని ఎప్పుడు, ఎక్కడ క్రాస్ చేస్తాం?"

నొసలు ముడివేస్తూ సాలోచనగా కాలిక్యులేట్ చేశాడు షాడో.

"రాజూ! వద్దు... వీళ్ళకి సాయం చేయొద్దు..." అంటూ ఆ మాప్‌ని లాగి అవతలికి విసిరేసింది సీమ.

ఆమె చేయి పట్టుకొని, చెంప అదిరిపోయేటట్లు కొట్టాడు విక్టర్.

"వద్దు... రాజూ! వద్దు!!" గద్గదస్వరంతో మరింత గట్టిగా అబ్జెక్ట్ చేసింది సీమ.

"చూడు సీమా... నేను చెప్పననీ, సాయం చేయననీ బిగతీసుకు కూర్చుంటాననే అనుకో... విక్టర్ ఏం చేస్తాడో తెలుసా?" కామ్‌గా అన్నాడు షాడో.

"చిత్రవధ చేసయినా చెప్పిస్తాను రెండవ కాలును కూడా విరిచేస్తాను" వెంటనే అందుకున్నాడు విక్టర్.

"నా కాళ్ళను విరిచేస్తే ఫరవాలేదు. నా కోసం బాధ పడేవాళ్ళు కూడా లేరు. కాని ఇతను అంతటితో శాంతించక..."

"మిగిలిన వారందరినీ హింసిస్తాను ప్రయాణీకులందరినీ హింసిస్తాను ప్రయాణీకులందరినీ సముద్రంలోకి నెట్టి చంపేస్తాను" మరోసారి అందుకున్నాడు విక్టర్.

చూశావా అన్నట్లు భుజాలు ఎగరేసి మాప్‌ని అందుకున్నాడు షాడో.

"ఇదే వేగంతో ప్రయాణించండి. ఎల్లుండి తెల్లవారు ఝామున ప్రిన్సెస్ మీకు ఎదురుపడుతుంది" అన్నాడు కాలిక్యులేషన్ పూర్తిచేసి మాప్ మీద ఆ ప్లేస్‌ని గుర్తు పెడుతూ.

"ఎగ్జాక్ట్ లీ రాజు! యూవార్ సెంట్ పర్సంట్ కరెక్ట్. మా నావిగేటర్స్ కూడా ఇదేమాట చెప్పారు. కాకపోతే వాళ్ళు నలుగురు కలిసి అరగంట తలలు చెడగొట్టుకొని యీ విషయం చెప్పారు. నువ్వు రెండు నిముషాలలో

ఫినిష్ చేసేశావ్... రాజు! హౌ ఎబౌట్ జాయినింగ్ విత్ మీ?" నాతో చేరితే నిన్ను నా లెఫ్టినెంట్ గా చేస్తాను నీకు ఎంత జీతం కావాలంటే అంత యిస్తాను.." అన్నాడు విక్టర్.

"సార్... మీ డబ్బూ వద్దు... మీ పదవులూ వద్దు నన్ను ముందు ఏదయినా హాస్పిటల్‌లో చేర్చే మార్గం చూడండి చాలు..." నమస్కారం చేస్తూ అన్నాడు షాడో.

పెద్దగా నవ్వాడు విక్టర్. "తప్పకుండా రాజు అనవసరంగా ప్రాణాలు తీయటం నాకు ఇష్టంలేదు. మా పని అయిపోగానే మీ అందర్నీ వదిలేస్తాను బిలీవ్ మీ... అంటూ వెళ్లిపోయాడు.

అలసటగా దిండును ఆనుకొంటున్న షాడోను చూసి దూరంగా జరిగింది సీమ. "వెధవ ప్రాణాలకు ఆశపడి శత్రువుకు తల వంచుతావా? చేతులెత్తి నమస్కరిస్తావా?" అన్నది అసహ్యంగా చూస్తూ.

"చూడు డియర్... నేను హీరోని కాదు. ఒకసారి హీరో వేషం వేయటానికి ప్రయత్నిస్తే కాలు ఏమయిందో చూస్తూనే వున్నావుగా?!!" చిరునవ్వుతో అన్నాడు షాడో.

ఏదో అనబోయింది సీమ. క్లినిక్ లోకి పోయిన డాక్టర్ శర్మ... ఏదో ఇంజక్షన్ తెచ్చి ఈ సారి నిజంగానే భుజంలో పొడిచాడు.

నీడిల్ బయటికి వచ్చిన మరుక్షణం గాఢనిద్రలోకి జారిపోయాడు షాడో. రెండు గంటలకల్లా మెలకువ వచ్చింది. అదిరిపోయిన డాక్టర్ శర్మ... హడావుడిగా పోయి తను యిచ్చిన ఇంజక్షన్ బాటిల్‌ని మరోసారి సరి చూసుకున్నాడు.

"రాజు! నువ్వు రేపు ఉదయందాకా నిద్రలేవకూడదు... ఈ మందు..." అంటున్న అతన్ని మాటాడవద్దని సైగచేశాడు షాడో.

ఎటువంటి చిత్రహింసలనైనా తట్టుకోవటానికి కండిషన్ చేయబడిన షాడో శరీరంమీద మత్తుమందులు ఎంతోకాలం తమ ప్రభావాన్ని ప్రసరించలేవని డాక్టర్ శర్మకు ఎలా తెలుస్తుంది?

అతని ఆలోచనలకు సమాధానం దొరక్కముందే మాప్‌లను పట్టుకొని ఆ గదిలోకి వచ్చాడు విక్టర్ కొడుకు నెపోలియన్.

"ప్రిన్సెస్ వేగం మరో రెండు నాట్లు హెచ్చింపబడిందిట. మనం దాన్ని కలుసుకునే టైంలో చేంజి వస్తుందా? అన్నాడు మాప్ ని షాడో ముందు పెడుతూ.

లెక్కలు కట్టి చెప్పాడు షాడో. అతను వెళ్లిపోయేసరికి సరిగ్గా రాత్రి తొమ్మిది గంటల్ని సూచించింది గోడమీద గడియారం.

కాప్టన్ టోనీ పరిస్థితిలో కొంచెం మార్పు కనిపిస్తోంది. విరిగి కాలుని కదిలించటానికి ప్రయత్నిస్తున్న వాసును చెడామడా తిట్టి షాడో దగ్గరికి వచ్చాడు డాక్టర్ శర్మ.

క్లినిక్‌లో వున్న పాలపొడిని, కాఫీపొడర్‌ని ఉపయోగించి కాఫీ తయారుచేసి తీసుకొచ్చింది సీమ. ఒక కప్పును బయట వున్న గార్డుకు యివ్వమన్నాడు షాడో. నిరాకరించింది సీమ. "ఆ బ్లడీ రోగ్ దగ్గరికి నేను పోను" అంటూ.

డాక్టర్ వంక చూశాడు షాడో. అతను జేబులో వున్న చిన్న బాటిల్‌ని తీసి ఆ కప్పులో పడేశాడు టాబిలెట్లను.

"మూడు గంటలు గారెంటీగా నిద్రపోతాడు. నీలాంటి శరీరం అయితే అసలు నిద్రపోడు."

అసలు విషయాన్ని గమనించిన సీమ కప్పును తీసుకుపోయి గార్డుకు యిచ్చివచ్చింది. గోడ గడియారం పదిన్నర చూపిస్తుండగా లేచాడు షాడో. కాలి బాండేజీలను విప్పి తలగడ క్రింద దాచాడు. "డాక్టర్... నా కాలు మొద్దు బాదేందుకు ఏదైనా యింజక్షన్ యివ్వండి..." అంటూ లేచి నిలబడ్డాడు కాలు మడతపడింది. బోర్లాపడి మెల్లిగా మంచాన్ని పట్టుకొని లేస్తుండగాసీమ వచ్చి సాయంచేసింది.

"రాజూ! కాలు దెబ్బతింటుంది, వద్దు..." హెచ్చరించాడు డాక్టర్ శర్మ.

"డూ యాజై సే..." కఠినంగా అన్నాడు షాడో. కాప్టెన్ టోనీ తర్వాత కావేరికి కాప్టెన్ అతనే. అందువల్ల అతని ఆర్డర్లు పాటించక తప్పలేదు. డాక్టర్ కి. సిరంజి తెచ్చి యింజక్షన్ ఇచ్చాడు.

ఆ ఇంజక్షన్ కూడా ఎంతోకాలం పనిచేయదని షాడోకు తెలుసు. కానీ... తను చేయబోయే పనిమీద కావేరి ప్రయాణీకుల ప్రాణాలు ఆధారపడి వున్నాయి... తన కాలు కంటె వారి ప్రాణాలు చాలా ముఖ్యం.

అతని ఉద్దేశ్యాన్ని కనిపెట్టి బెదిరిపోయింది సీమ.

"డాక్టర్! రాజును ఆపండి. ఈ పరిస్థితుల్లో అతను బయటకి పోవటం చాలా ప్రమాదకరం. విక్టర్ చూస్తే ప్రాణాలు తీసేస్తాడు" అన్నది డాక్టర్ చేతులు పట్టుకొని

"లాభం లేదమ్మా. దుర్మార్గుడు నా మాట వినడు. హీ యీజ్ డెవిల్," గట్టిగా నిట్టూరుస్తూ అన్నాడు డాక్టర్ శర్మ.

"రాజూ! నా మాట విను రాజూ!" అంటూ షాడో గడ్డం పట్టుకొని బ్రతిమిలాడింది సీమ.

సమాధానం యివ్వలేదు షాడో.

"ఆపకండి మిస్ సీమా! మనందరి ప్రాణాలు రాజు మీద ఆధారపడి వున్నాయి" బెడ్ మీద కూర్చుని కాలును సవరించుకుంటున్న వాసు, సీమతో అన్నాడు.

"రా... జు... మీ... ద... ఆధార... ప... డి... వు... న్నా... యి..." అతని కంఠాన్ని అనుసరిస్తూ వెక్కిరించింది సీమ. "హాయిగా మంచం మీద కూర్చుని కబుర్లు చెప్పటానికి మాత్రం రెడీ. పోయేవి మన ప్రాణాలు కాదుగా!!" అని ఎత్తి పొడిచింది.

చిన్నగా నవ్వాడు వాసు. "నిజం చెప్పారు. నా ప్రాణాల మీద నాకు చాలా తీపి. అందుకే అటువంటి రిస్కులు తీసుకోను."

సీమ కళ్ళు ఒక్కసారిగా తెరుచుకున్నాయి. మెస్ హాల్లో జరిగిన ఫైటింగ్ ఆమె కనుల ముందు మెదిలింది. షాడోకు అడ్డం నిలబడి అతని ప్రాణాలు కాపాడటానికి ప్రయత్నించటం వల్లనే వాసుకు ఆ గతి పట్టింది

కాలును స్వాధీనంలోకి తెచ్చుకున్న షాడో... బయలు దేరడానికి సిద్ధపడుతుండగా తన దిండు క్రింద దాచి వుంచిన కత్తిని తీసి అందించాడు వాసు. "విష్ యూ బెస్టాఫ్ లక్ రాజూ!!" అంటూ.

అతని భుజం తట్టి కత్తిని అందుకున్నాడు షాడో. వరండాలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు విక్టర్ అనుచరుడు డాక్టర్ యిచ్చిన టాబిలెట్ల మూలకంగా.

అటూ యిటూ చూసి బయటకు పోబోతుండగా సీమ అతని ప్రక్కకు వచ్చింది. "నేనూ వస్తున్నానురాజూ... అంది అతని వంక చూడకుండా.

"నీకేమైనా పిచ్చి ఎక్కిందా? ఎవరైనా చూస్తే ప్రాణాలు పోతాయి..." ఆశ్చర్యంగా అన్నాడు షాడో.

"నన్ను చూస్తే నా ప్రాణాలు పోతాయి. నిన్ను చూస్తే నీ ప్రాణాలు పోవుకదూ?" చెమ్మగిల్లిన కళ్లతో గద్గదంగా అన్నది సీమ.

ఇక ఆమెతో వాదించి ప్రయోజనం వుండదని గ్రహించి మౌనంగా ముందుకు అడుగువేశాడు షాడో. అడుగుతీసి అడుగు వేయటం బ్రహ్మ ప్రయత్నం అవుతోంది. బాధతో నరాలు మెలితిరిగి పోతున్నాయి. "బ్లడీ డాక్టర్... మందివ్వమంటే మంచినీళ్లు యిచ్చినట్లున్నాడు.." డాక్టర్ శర్మని తిట్టటంలో ఆ బాధని మర్చిపోవటానికి ప్రయత్నిస్తూ, సీమ భుజం మీద చెయ్యివేసి ముందుకు కదిలాడు షాడో.

***

స్కాటింగ్ ప్లేస్‌లోను, కంట్రోలింగ్ టవర్ మీదా విక్టర్ అనుచరులు నిలబడి వున్నారు. నలుపురంగు దుస్తులను ధరించి రాక్షసుల మాదిరి అగుపిస్తున్న ఆ మర్డరింగ్ డెవిల్స్‌ని చూసి భయంతో కంపించిపోయింది సీమ.

"రాజు! వీళ్ళు మనల్నెందుకు ఎటాక్ చేశారు? మనం వీళ్ళకు చేసిన అపకారం ఏమిటి?" అని అడిగింది. షాడోని అనుకొని నిలబడుతూ.

అదే ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు షాడో. ఆ పని విక్టర్ నిజస్వరూపం బయటపడిన దగ్గర్నించీ చేస్తూ వున్నాడు. ఫలితం ఏమీ కనిపించలేదు...

దగ్గరిగా నిలబడిన సీమ శరీరం మీదినుంచి మనస్సును మత్తెక్కించేటట్లు వస్తున్నాయి సెంట్ వాసనలు. చల్లటి ఆ వాతావరణంలో వెచ్చటి ఆమె శరీరం.

"డామ్ డర్టీ థాట్స్... కాళ్ళు చేతులు విరగగొట్టుకున్నా బుద్ధులు మాత్రం మారటం లేదు..." ఎత్తి పొడిచింది అంతరాత్మ.

ఉలిక్కిపడి ఆ ఆలోచనల నుంచి బయటపడ్డాడు షాడో. "కమాన్ సీమా... మనం మరికొంచెం ముందుకు పోవాలి..." అంటూ ముందుకు అడుగు వేయబోయి, ఎగిరి వెనక్కు దూకాడు. కుడికాలు మడతబడింది. బాధ కత్తులు పెట్టి పొడిచినట్లు శరీరమంతా వ్యాపించి, నేలకు జారిపోయాడు...

కెవ్వున అరవబోయింది సీమ. మెరుపులా ఆమె నోటిని మూసి క్రిందికి లాగాడు షాడో.

"ఫర్ గాడ్ సేక్... బీ క్వయిట్..." అని గర్జిస్తూ ముందుకు చూశాడు. పదిమంది అనుచరులను వెంటబెట్టుకొని మెస్ హాల్ వైపు వెళుతున్నాడు విక్టర్ పది అడుగుల దూరంలో జరిగిన భాగవతం అతనికి కనిపించలేదు.

పిల్లిలా ముందుకు జరిగాడు షాడో. "రా, రాజు... ప్లీజ్.." అంటూ నూట నాలుగు డిగ్రీల వేడితో కాలిపోతున్న షాడో చేతిని పట్టుకొని వెనక్కు లాగింది.

చిరాకుగా చూశాడు షాడో..."జ్వరం వచ్చిందంటే రాకుండా ఎందుకుంటుంది? ఇంత రాత్రివేళ నువ్వుపక్కన వుంటే ప్రాణాలు పోతున్నవాడికి కూడా పుడుతుంది వేడి... " అన్నాడు కసిగా.

ఛట్‌న ముఖాన్ని దాచుకుంది సీమ. కాలివేళ్ళ దగ్గర్నించి ఆమె తల వెంట్రుకలదాకా... అదో విధమైన అనుభూతి ఆవరించుకుంది. తనువు పులకరించి, కనులు అరమూతలు పడ్డాయి"

ఆ లక్షణాలను గమనించి ఖంగారుగా ముందుకు జరిగాడు షాడో, అక్కడికి పాతిక అడుగులు దూరంలోనే వున్నది మెస్ హాల్.

ఒక ఆయిల్ డ్రమ్ చాటున బాసిపట్టు వేసి కూర్చుని ముందుకు తొంగిచూశాడు. తన భుజంమీది నుంచి చూడబోయిన సీమను బలవంతంగా వెనక్కు నెట్టాడు. మిలమిలా మెరిసే టేబిల్స్‌తో, మెత్తగా

వుండే కుషన్ సీట్లతో కంటికి యింపుగా, ఎంతో మెజిస్టిక్గా కనిపించే మెస్ హాలు... యిప్పుడు వరద బాధితుల సహాయ శిబిరంలా కనిపిస్తోంది

ఎయిర్ కండిషన్డ్ కాబిన్స్లో గడపాల్సిన ప్రయాణీకులు అందరూ... కటికి నేలమీద కునికిపాట్లు పడుతున్నారు. యుద్ధ ఖైదీలను మంద వేసినట్లు వారందర్నీ ఒక గుంపుగా కూర్చోపెట్టి కాపలా కాస్తున్నారు పిశాచుల వంటి విక్టర్ అనుచరులు.

"జంటిల్మన్! మీకు యిటువంటి దుస్థితిని కలిగించటం నిజంగా నాకు ఎంతో బాధగా వుంది. బట్ ఐ కాన్ట్ హెల్పిట్. మీ ఎయిర్ కండిషన్డు కాబిన్స్ అన్నీ నా అనుచరులకు కావాల్సి వచ్చాయి. నాకు కొంచెం స్వార్థం ఎక్కువ. అందువల్ల మీరందరూ..." మెస్ హాలు ముందు నిలబడి వారందరి వంకా చూస్తూ హుందాగా అంటున్నాడు విక్టర్.

"మిస్టర్... ఇంకెన్ని రోజులు మేమిలా అవస్థలు పడాలి. అసలు ఏమిటి యిదంతా?" ఒక ప్రక్కగా కూర్చుని వున్న జయరాం ప్రసాద్ ప్రశ్నించాడు వెంటనే.

"ఓ... ఇండియన్ ఇండస్ట్రియల్ కింగ్ జయరాం ప్రసాద్ గారా? నమస్కారం. ఇంకెన్నో రోజులు అవసరంలేదు. ఎల్లుండి సూర్యుడు వుదయించిన మరుక్షణం అంతమయిపోతాయి మీ బాధలు" నవ్వుతూ సమాధానం యిచ్చాడు విక్టర్.

"అంటే నీ వుద్దేశ్యం ఏమిటీ?" అనుమానంగా ప్రశ్నించాడాయన.

"ప్రిన్సెస్ అనే ఆస్ట్రేలియన్ నౌక మనకు ఎదురుగా వస్తోంది మిమ్మల్నందర్నీ దాంట్లో ఎక్కించి సురక్షితంగా అవతలికి పంపేస్తాం.."

"మరి కాప్టన్ టోనీ, చీఫ్ ఆఫీసర్ రాజు!!"

"మీ సంగతి గురించి మీరు ఆలోచించుకోండి... మిగిలినవారిని గురించి అనవసరమైన బాధలకు లోనుకాకండి..." అంటూ గిర్రున వెనుతిరిగాడు విక్టర్.

"రాజు! మనల్ని సురక్షితంగా ప్రిన్సెస్ మీదికి చేరుస్తాడా! అందుకేనా దాని వివరాలు అడిగాడు?" షాడో చెవి దగ్గిర నోరుపెట్టి గుసగుసలాడింది సీమ.

పట్టులాంటి ఆమె తల వెంట్రుకలు మెడమీదపడి చక్కలిగింతలు పెడుతున్నాయి. సూటిగా సాగటం మానేశాయి షాడో ఆలోచనలు.

మెస్ హాల్ దగ్గిర్నించి, క్రింద వున్న కాబిన్స్ వైపు పోతున్నాడు విక్టర్. అదే సమయంలో కంట్రోలింగ్ టవర్ దగ్గిర్నించి హడావుడిగా పరిగెత్తుకువచ్చి అతన్ని కలుసుకున్నాడు నెపోలియన్. ఏదో విషయాన్ని గురించి తీవ్రంగా చర్చిస్తూ కాబిన్స్ వున్న కారిడార్ లోకి వెళ్ళారు వారిద్దరూ.

"సీమా... నువ్వు యిక్కడే వుండు... ఎక్కడికీ కదలొద్దు..."అంటూ ముందుకు జరిగాడు షాడో.

మరుక్షణం ఒక బూటు కాలు వచ్చి అతని తొడల సమీపంలో నిలబడింది. రాతిబొమ్మలా బిగుసుకుపోయాడు షాడో. ఊపిరి బిగపట్టి కనులు కొంచెంగా పైకెత్తి చూశాడు.

సిగిరెట్ నుసిని షాడో ముఖంమీద విదిలించి రైఫిల్ని సరిగ్గా షాడో కుడిమోకాలి మీద ఆనించి దిక్కులు చూస్తున్నాడా వ్యక్తి. ఇంకా క్రిందికి చూడలేదు.

పదునైన కత్తి ఒకటి కాలిలో దిగబడినట్లు ఎగసుకు వస్తోంది పెయిన్. పళ్ళ బిగువున తమాయించుకొని... మెల్లిగా చేతుల్ని పైకి ఎత్తాడుషాడో. పిడికిలి బిగించి అతని మోకాళ్ళ వెనుక గుద్దాడు

"వాట్!!" అంటూ వెనక్కి దొర్లాడతను. షాడో తల మీదినించి పల్టీ కొట్టి సీమ వళ్ళో పడ్డాడు

అరచేత్తో అతని ముఖం మీద చరిచింది సీమ. అతని చేతిలో నుంచి జారిపోయిన రైఫిల్ని తిరగేసి తల మీద కొట్టాడుషాడో.

"సీమా... ఇతన్ని యిక్కడి నుంచి కదలనీయకు..." అని హెచ్చరించి రైఫిల్ని వూత కర్రలా పట్టుకొని కుంటుకుంటూ కాబిన్స్ వున్న కారిడార్లోకి అడుగుపెట్టాడుషాడో.

ఓరగా తెరిచి వున్నాయి విక్టర్ గది తలుపులు. లోపల నెపోలియన్, మోర్గాన్, విక్టర్‌లు తీవ్రాతి తీవ్రంగా వాదించుకుంటున్నారు.

"మనకు బంగారం ముఖ్యం. ఈ ఓడలోని ప్రయాణీకులు కాదు. వీళ్ళని ప్రాణాలతో వుంచితే... మన ఐడెంటిటీ అందరికీ తెలిసిపోతుంది. అందువల్ల ప్రిన్సెస్‌ని లూటీచేసి వీరందర్నీ దాని మీదికి ఎక్కిస్తాం, బాంబును కూడా ప్రిన్సెస్ మీదికి చేరుస్తాం. మనం ఫైరింగ్ రేంజిని దాటగానే ప్రేలిపోతుంది ప్రిన్సెస్. దానితోపాటు మనల్ని గుర్తుపట్టగల హీరోలందరూ గల్లంతు అయిపోతారు. తమ ఓడ ఏమయిందో అర్థంకాక మతులు పోగొట్టుకుంటారు ఆస్ట్రేలియన్ అధికారులు..." అంటున్నాడు విక్టర్. చెమటలతో తడిసిపోయింది షాడో శరీరం. నూట నాలుగు డిగ్రీల జ్వరంతో కాలిపోతున్న అతని శరీరం ఆ మాటల్ని వినేసరికి ఒక్కసారిగా చల్లబడి పోయింది... కావేరి మీద హత్యలు జరగటానికి కారణాలు అతనికి ఒకటొకటిగా అర్థం కాసాగాయి...

"ఎవరది?" ఖంగుమంటూ వినవచ్చిందొక కంఠం. ఉలిక్కిపడి వెనుతిరిగాడు షాడో.

ద్వారంలో నిలబడి వున్నాడొక విక్టర్ అనుచరుడు. అతని చేతిలోని మెషిన్ గన్ మృత్యుదేవతలా నోరు తెరుచుకొని చూస్తోంది

గుటక మ్రింగటం షాడోకు చేతకాలేదు. గదిలోవున్న విక్టర్ ఏ క్షణంలోనైనా బయటికి రావచ్చు... అతను బయటికి వచ్చిన మరుక్షణం తన బండారం బయటపడి పోతుంది.

"ఎవరది?" అంటూ రెండు అడుగులు వేశాడా వ్యక్తి. రైఫిల్ ని నేలకు ఆనించి ముందుకు కదిలాడు షాడో.

"ఓ! నువ్వా!!" ఆశ్చర్యంగా అన్నాడు ఆ వ్యక్తి. మరుక్షణం అతని కనుబొమ్మలు ముడి పడ్డాయి"నువ్వెందు కొచ్చావిక్కడికి?" అంటూ మిషన్ గన్‌ని షాడో గుండెల మీదికి గురి పెట్టబోయాడు.

డిస్పరేట్‌గా కదిలాడు షాడో. ఏమాత్రం ఆలస్యం అయినా సర్వనాశనమౌతుంది.

బరువునంతా ఎడమకాలి మీదవేసి రైఫిల్‌ని ముందుకు విసిరాడు. మిషన్ గన్ ట్రిగ్గర్ మీద బిగుసుకోబోతున్నదా వ్యక్తి చూపుడువేలు. సుదర్శన చక్రంలా గింగిరాలు తిరుగుతూ పోయి అతని ముఖానికి తగిలింది రైఫిల్. పెద్దగా అరిచి బోర్లా పడ్డాడతను

షాడో మెడ మీది వెంట్రుకలన్నీ సూదుల్లా నిక్కబొడుచుకున్నాయి...

"అయిపోయింది... అంతా అయిపోయింది..." అనుకుంటుండగానే ఆకాశంలో నుంచి వూడిపడినట్లు అక్కడ ప్రత్యక్షమయింది సీమ. పమిట

చెంగును ఆ వ్యక్తి మెడ చుట్టూ మెలిక వేసి ముళ్ళ కంపను యీడ్చినట్లు బయటికి యీడ్చుకుపోయింది.

క్రింద పడిన మెషిన్ గన్, రైఫిల్స్‌ని అందుకొని, ఒంటి కాలు మీద ఎగురుతూ పరుగుతీశాడు షాడో.

రెండు క్షణాలు కూడా గడవక ముందే కారిడార్‌లో ప్రత్యక్షమైనాడు విక్టర్. "ఎవడ్రా అరిచింది? ఎవడ్రా అది?" అంటూ అటూ యిటూ చూశాడు.

ఆయిల్ డ్రమ్ చాటున మోకరించి కూర్చుని... దడదడ లాడుతున్న గుండెలతో వూపిర్లు బిగపట్టారు షాడో సీమలు.

బెల్టులో దోపివున్న కత్తిపిడి మీద బిగుసుకుంది షాడో ఎడమచేయి...

"యువ్వార్ అవుటాఫ్ కమీషన్.... నీకున్న అధికారాలన్నీ తాత్కాలికంగా రద్దు చేయబడ్డాయి. పిచ్చివేషాలు వేస్తే సివిలియన్ మాదిరి కోర్టుల్లో హాజరై సమాధానం చెప్పుకోవాల్సి వస్తుంది" ఢంకా దెబ్బల్లా అతని చెవిలో మార్మోగాయి కులకర్ణిగారి మాటలు.

"టు హెల్ విత్ ఎవ్రీ థింగ్... అమాయకులైన కావేరి ప్రయాణీకుల్ని, స్టాఫ్‌ని రక్షించుకోవాల్సిన బాధ్యత యిప్పుడు నీ మీద

వుంది. కాప్టన్ టోనీ గాయపడి పడిపోయాడు. నౌ యు ఆర్ ది కాప్టన్... రాజు! చూస్తావేం?" కరుకుగా హెచ్చరించింది షాడో అంతరాత్మ.

పళ్ళు బిగించి కత్తిని బయటికి లాగాడు షాడో.

ఉన్నట్లుండి కారిడార్ లోపలికి వెళ్ళిపోయాడు విక్టర్. "ఎవడో... వెధవ ముఖం తాగి తందనాలాడుతున్నట్లుంది నెపోలియన్... నువ్వు పోయి చూడు..." అని తన కొడుకును పిలుస్తూ దృష్టి పథంనుంచి మాయమై పోయాడు.

చెమటలు క్రమ్మిన ముఖాన్ని కుడిచేతితో తుడుచుకుంటూ సీమ వంక చూశాడు షాడో.

విశాలమైన కాటుక కళ్ళను మరింత వెడల్పు చేసి, అతని వంకే చూస్తోంది సీమ. అంతవరకూ ఆమెకు తెలిసిన రాజులో వున్నట్లుండి ఏదో భయంకరమైన మార్పు వచ్చినట్లు గ్రహించింది ఆమె హృదయం. ఏమిటో అది. తెలుసుకోవటానికి ప్రయత్నిస్తోందామె

కారిడార్‌లో అడుగుల శబ్దం వినవచ్చి చీకట్లో కిజరిగాడు షాడో. పెద్ద కొరడా నొకదాన్ని పట్టుకొని తాగి తందనాలాడుతున్న అనుచరుడిని వెతుకుతూ బయలు దేరాడు నెపోలియన్.

అతను స్కాటింగ్ ప్లేస్ వైపు పోగానే, స్పృహ లేని గార్డును భుజానికి ఎత్తుకొని లేచి నిలబడ్డాడు షాడో. రెండవ గార్డు చేతిని పట్టుకొని

ముందుకు యీడుస్తూ, లోడింగ్ ఎపార్ట్‌మెంట్స్ వైపు దారి తీశాడు. ఆ గార్డు రెండవ చేతిని పట్టుకొని షాడోకు సహాయం చేస్తూ అనుసరించింది సీమ.

ఇనుప నిచ్చెనలు అమర్చివున్నాయి లోడింగ్ ఎపార్ట్‌మెంట్స్‌లో దిగటానికి వీలుగా. భుజం మీద గార్డుతో క్రిందకి దిగాడు షాడో. రెండు నిముషాల తరువాత పైకి వచ్చి రెండవ గార్డును కూడా క్రిందికి దింపాడు.

చెమటలతో తడిసిపోయాయి అతని దుస్తులన్నీ. ఆయాసంతో గుండెలు ఎగసిపడుతున్నాయి. విపరీతమైన కదలిక వల్ల కుడి తొడమీద గాయం తిరిగి రేగి రక్తాన్ని వెలువరుస్తోంది

"ఇలా అయితే ఎలా? ప్రాణాలు తీసుకునే యీ ఎడ్వంచర్ దేనికి?" కళ్ళు నీరెట్టుకుంటూ గద్గదంగా అంటున్న సీమను బలవంతంగా క్రిందికి తీసుకుపోయాడు.

గార్డుల కాళ్ళు చేతులను బంధించి, వారి నోళ్ళల్లో జనపనార పీచులను కుక్కి ఒక ఖాళీ చెక్క పెట్టెలో కూర్చోపెట్టాడు

అక్కడే వరుసల్లో నిలబెట్టి వున్నాయి కల్వారీలో లోడ్ చేయబడిన జనరేటర్లన్నీ. పది అడుగుల పొడవు, ఎనిమిది అడుగుల వెడల్పు వున్న జైగాంటిక్ వుడెన్ బాక్సులవి. షాడో సూచనను అనుసరించి... ఒక్క

చెక్కపెట్టను తట్టి చూసింది సీమ. లూజ్‌గా వున్న చెక్క నొకదాన్ని తొలగించి, లోపలకు తొంగి చూసింది. అంతా కటిక చీకటి.

పాంటు జేబులో వున్న లైటర్‌ని ఆమెకు యిచ్చాడు షాడో. దాని వెలుగులో ఆ చెక్క పెట్టెను పరిశీలించి బిత్తరపోయిందామె.

జనరేటర్ వుండవల్సిన ఆ పెట్టె... కోళ్ళు లేని గూడులా ఖాళీగా వుంది! అదే కాదు... రెండు పెట్టెలు తప్పనిచ్చి మిగిలినవన్నీ అలాగే వున్నాయి.!!!

"జనరేటర్లని చెప్పి, యీ పెట్టెల్లో తన మనుషుల్ని కావేరి మీదికి ఎక్కించాడు విక్టర్. కల్హారీ సైనికులు ఓడనంతా గాలించారు కాని పెట్టెల్లో ఏముందో చూడలేదు.

"ఆ రోజు క్రింద పడుతున్న పెట్టెను అడ్డుకున్నాను నేను. నాకు బుద్ధి లేదు. ఆ పెట్టె క్రింద పడివుంటే యీ విక్టర్ రహస్యం కల్హారీ రేవులోనే వెల్లడి అయివుండేది... నౌ యిటీస్ టూ లేట్!" విక్టర్‌ని కలుసుకోవటానికి వీళ్ళు బయటికి వస్తుండగా కావేరి కుక్ ప్రీతిపాల్ చూసి వుంటాడు. అతన్ని హతమార్చి సముద్రంలో నెట్టి వుంటారీ రాక్షసులు. స్కేటింగ్ ప్లేస్ దగ్గర నిలబడిన కురిషీకి కూడా అటువంటి గతే పట్టింది.. తనకు కూడా... పట్టబోయింది. వాసు దయవల్ల బ్రతికి బయటపడటం జరిగింది.

"రాజు! మరి రేడియో రూమ్ లో వున్న శివరామ్‌ని హత్యచేశారు కదు? అతను కూడా వీళ్ళని చూసి వుంటాడా?" షాడో ఆలోచనలను ఫాలో అవుతూ ప్రశ్నించింది సీమ.

తల ఆడించాడు కానీ... అసలు విషయాన్ని ఆమెకు చెప్పలేదు షాడో... శివరామ్‌ని హత్య చేయటానికి మరో కారణం వుంది... డెక్ మీద అంతమంది తిరుగుతుండగా రేడియో రూమ్ లోకి పోయి ఆపని చేయాల్సినంత అవసరం విక్టర్‌కి...

లోడింగ్ ఎపార్టుమెంట్‌లో ఒక మూలగా వున్న శవపేటికలను చూడగానే షాడో ఆలోచనలు ఎండ్ అయిపోయాయి.

కల్హారీ కల్లోలాల్లో ప్రాణాలు పోగొట్టుకున్న ఆస్ట్రేలియా దేశస్తులు దీర్ఘ నిద్రపోతున్నారు ఆ శవపేటికలలో, శరీరాలు చెడిపోకుండా కొన్ని కెమికల్స్‌ని యూజ్ చేసి పాక్ చేయించింది కల్హారీ మిలటరీ.

బెల్ట్‌లో ఉన్న కత్తిని బైటికి లాగి ఒక పేటిక ముందు కూర్చున్నాడు షాడో. లైటర్‌ని వెలిగించి, ఆ వెలుగును పేటికమీద మేకులమీద పడేటట్లు పట్టుకుంది సీమ.

రెండు నిముషాల్లో ఓపెన్ అయింది పైమూత. పాలిపోయిన ప్రేత ముఖం ఒకటి వికృతంగా చూసింది వారి వంక.

కళ్ళు మూసుకొని షాడో భుజం మీద వాలిపోయింది సీమ. "టేకిట్ యీజీ డియర్... మనం కూడా ఏదో ఒక రోజున యిలాగే తయారౌతాం... భయం దేనికి?" అంటూ ఆ పెట్టెను క్లోజ్ చేసి మరో పెట్టెమీద దాడి చేశాడు షాడో.

"వెళ్ళిపోదాం రాజూ! నా కేమిటో భయంగా వుంది... ప్లీజ్.." అంటున్న సీమ ముఖం రెండవ పెట్టె తెరుచుకున్న మరుక్షణం భయంతో తెల్లగా పాలిపోయింది. "మై గాడ్! మై గాడ్!!అంటూ నేలమీద చతికిల పడింది ఆమె.

"హేట్సాఫ్ టు యువర్ ఇంటలిజెన్స్ విక్టర్! యూ దర్టీ ట్రబుల్ మేకర్!!" అంటూ ఆ పేటికలో ఉన్న శవాన్ని కాదు... ఆటంబాంబును చేతులతో తడిమాడు షాడో.

ఏ బాంబు కోసం కల్హారీ మిలటరీ అధికారులు ఓడనంతా గాలించారో, అదే ఆటంబాంబు వారి కళ్ళముందే నిక్షిప్తమై ఉంది. శవపేటికలో వున్న శవాన్ని సముద్రంలోకి దొర్లించి అందులో బాంబును దాస్తారని ఎవరు వూహించగలరు?

"ఈ బాంబును ఇక్కడినుంచి కదిలించాలి. దీన్ని నిరుపయోగం చేయటానికి చాలా టైం తీసుకుంటుంది... వీళ్ళకు అనుమానం రాకుండా చేయాలి ఈ పని..." సాలోచనగా అంటూ లేచి నిలబడిన షాడో ఎందుకో ఉలిక్కిపడి వెనక్కిచూశాడు.

డేంజర్ సిగ్నల్స్ పంపుతున్నది సిక్స్‌త్ సెన్స్... ఆ సిగ్నల్స్‌ని షాడో అర్థం చేసుకుంటుండగానే ఎదుట ప్రత్యక్షమయిందా డేంజర్... నెపోలియన్ రూపంలో.

మిలమిల మెరిసిపోతున్న రివాల్వర్‌ని షాడో కేసి గురిపెట్టి టార్చ్‌లైట్‌ని వెలిగించి వారు చేస్తున్న పనిని క్లియర్‌గా చూశాడు నెపోలియన్.

"బాంబును ఏం చేయాలో నేను చెప్తాను, లేదా మా ఫాదర్ చెప్పారు. మీరు అనవసరంగా శ్రమ తీసుకోకండి..." అంటూ వికటంగా నవ్వాడతను.

* * *

చేతిని వెనక్కు వంచి, కత్తిని అండర్ హేండ్ త్రోకి రెడీ చేశాడు షాడో. కొత్తగా ఉన్నదా కత్తి. బాలెన్స్ సరిపోవటం లేదు.

"హేట్సాఫ్ టు యువర్ ఇంటెలిజెన్స్ రాజు! కాలు విరిగిపోయిందని నాటకం ఆడి మా ఫాదర్‌నే నమ్మించిన మొనగాడివి, నిన్ను ఏవిధంగా మెచ్చుకోవాలో నాకు అర్థం కావటంలేదు. నీ కాలును యీ సారి నిజంగానే విరగగొట్టి ఫాదర్ దగ్గరికి తీసుకుపోతాను..." అంటూ ట్రిగ్గర్‌ని నొక్కాడు నెపోలియన్.

రివాల్వర్ పేలటం అంటూ సంభవిస్తే... ఆ మ్రోత విక్టర్ అనుచరులందరికి వినిపించి తీరుతుంది.

మెరుపులా కదిలింది షాడో చేయి. కందిరీగలా ఝుంకారం చేస్తూ గాలిలోకి లేచింది కత్తి...

నెపోలియన్ గొంతుకేసి గురిపెట్టాడు షాడో. బాలెన్స్ సరిగ్గా లేకపోవడంవల్ల అది అడ్డం తిరిగి అతని కుడి భుజంలో దిగబడింది.

బాధగా అరిచి, రివాల్వర్‌ని వదిలేశాడు నెపోలియన్. ఎడమచేత్తో ఆ కత్తిని వూడలాగబోతుండగా ఒంటి కాలితో గాలిలో డైవ్ చేసి... తలతో అతని గుండెలమీద పొడిచాడు షాడో.

వెల్లకిలా పడ్డాడు నెపోలియన్!

"బాస్టర్డ్ ... నిన్ను నిలువునా నరికి సముద్ర జీవులకు ఆహారం వేయకపోతే నా పేరు" అంటున్నాడతను. అతని జుట్టు పట్టుకొని ఒక చెక్కపెట్టె కేసి కొట్టాడు షాడో.

నోట్లో నిమాటలు నోట్లో నేఆగిపోగా... స్పృహ తప్పి తలవాల్చేశాడు నెపోలియన్. తన చేతులకు అంటిన రక్తాన్ని అతని దుస్తులకే తుడిచి, కత్తిన శుభ్రపరిచి, బెల్ట్‌లో దోపుకున్నాడు షాడో.

ఆ దృశ్యాన్ని చూడలేక, కళ్ళు మూసుకొని ఒక చెక్క పెట్టె చాటున నిలబడి ఉన్నది సీమ.

"రాజూ! అతన్ని చంపేశావా?" అని అడిగింది తడబడుతున్న కంఠంతో బ్లడ్‌ని చూసి ఆమె భయపడుతున్నదని గ్రహించాడు షాడో.

"సీమా... నువ్వు డెక్ మీదికి వెళ్ళు... క్విక్..." అని హెచ్చరించి ఆమెను బలవంతంగా బైటికి పంపించాడు.

నెపోలియన్ తప్పించుకోవటానికి వీలులేదు. అతనిక తన తండ్రిని కలుసుకోకూడదు. కాని నెపోలియన్ కనిపించకపోతే ఓడనంతా సెర్చ్ చేస్తాడు.. తాము బంధించిన గార్డులను చూసినా అసలు విషయం బైటికి వచ్చేస్తుంది

నెపోలియన్ ని భుజంమీద వేసుకొని డెక్ చివరికి పోయాడు షాడో. చెక్క పెట్టెలలో బంధింపబడివున్న గార్డులను కూడా అక్కడికే చేర్చాడు.

కంట్రోలింగ్ టవర్ మీద ఉన్న గార్డులు కునికిపాట్లు పడుతున్నారు. వారికి చీకటి మాటున ఓడ చివరి భాగంలో జరుగుతున్న తతంగం సరిగా కనిపించలేదు.

కత్తిని తీసి, ఓడ ప్రక్క భాగంలో వ్రేలాడుతున్న లైఫ్ బోట్ సేఫ్టీ బెల్ట్‌లను కత్తిరించాడు షాడో. నెపోలియన్‌ని మిగిలిన వారిద్దర్నీ అందులో పడుకోబెట్టి ఆ బోటును నీట్లో కిదింపాడు.

దాన్ని ఓడకు కనెక్ట్ చేసి ఉంచిన త్రాళ్ళను వదులు చేయగానే, ఒక్కసారిగా ఎత్తి విసిరికొట్టాయి సముద్ర కెరటాలు. చూస్తుండగానే అది చీకట్లలో కలిసిపోయింది.

తెల్లవారే సమయానికి చాలా దూరంలో ఉంటుంది. లైఫ్ బోట్ మిస్ అయ్యిందని గ్రహిస్తే కావేరిని వెనక్కు తిప్పిస్తాడు విక్టర్. బహుశ మధ్యాహ్న సమయానికి ఆ బోటును వెతికి పట్టుకుంటారు. ఆ తర్వాత ఆ పని చేసినవారిని వెతుక్కుంటూ క్లినిక్‌లోకి వస్తారు.

రక్తంలో మలినమైన పనామాను నోట్లో పెట్టుకొని నిప్పు ముట్టించకుండా వెనుతిరుగుతూ క్రూరంగా నవ్వుకున్నాడు షాడో.

ఎస్! లైఫ్ బోట్ మిస్ అయిందని విక్టర్ తెలుసుకుంటే, తన పని అయిపోయినట్లే లెక్క. బట్ వాట్ ఎబౌట్ ఇట్?

ఈ లోపల మీటింగ్ ప్లేస్‌ని దాటి మరో యాంగిల్‌లో సూయేజ్ కెనాల్ వైపు వెళ్ళిపోతుంది ఆస్ట్రేలియన్ నౌక.

ప్రిన్సెస్ కావేరికంటే వేగంగా ప్రయాణించగలదు. విక్టర్ తల్లక్రిందులుగా నిలబడినా దాన్ని పట్టుకోలేదు.

కావేరి ప్రయాణీకుల భవిష్యత్తు ఆ ఒక్క విషయం మీద ఆధారపడి వుంది. విక్టర్ ప్రిన్సెస్‌ని పట్టుకుంటే వీరు అవుట్. పట్టుకోలేకపోతే... ???

లోడింగ్ ఎపార్ట్‌మెంట్‌లోని రక్తపు మరకల్ని తుడిచే ఓపిక, సమయం రెండూ లేకపోవటంవల్ల ఒక జనపనార బేలును ఆ ప్రదేశంలోకి దొర్లించి.. చేతులు దులుపుకుంటూ క్లినిక్ దగ్గరికి వచ్చాడు.

అప్పుడే కుర్చీలో కదులుతున్నాడు గార్డు. ద్వారంలో నిలబడి వున్న సీమ, డాక్టర్ శర్మ, షాడోని చూసి తేలికగా నిట్టూర్చారు

గబగబా పోయి కాలికి బేండేజీలు వేయించుకున్నాడు షాడో. చెక్కల్ని, చితుకుల్ని తిరిగి కట్టించుకొని, దుప్పటిని మీదికి లాక్కుంటుండగా ఆవలిస్తూ లేచి వచ్చాడు గార్డు.

చటుక్కున కళ్ళు మూసుకొని నిద్రను నటించాడు షాడో. మూసుకున్న కళ్ళను తేర్చే అవకాశం లభించలేదు. ఒక్కసారిగా అతని మీద పడి గాఢ పరిష్వంగనంలో బిగించేసింది నిద్రాదేవత.

* * *

తిరిగి షాడో కనులు తెరిచేసరికి పగలు పదకొండు గంటలైంది. చుట్టూ చూశాడు. కాప్టెన్ టోనీ గుండెల మీద బాండేజీలను ఛేంజ్ చేస్తు న్న డాక్టర్ శర్మ కనిపించాడు. సీమ లేదక్కడ.

"సీమ ఎక్కడసార్?" లేచి కూర్చుంటూ అడిగాడు.

"సత్రం భోజనం. మఠం నిద్రగాళ్ళం మనమిద్దరం, పెళ్ళాం పిల్లలు కొంపా గోళ్ళు లేని వాళ్ళం. సీమ ఒక ప్రిన్సెస్... ఆమె కోసం బాధపడే తల్లిదండ్రులు ఉన్నారు. అపురూపంగా పెరిగిన ఆ ఆడపిల్లను వెంటబెట్టుకు పోయి, జేమ్స్‌బాండ్ ఎడ్వెంచర్స్‌లో పడేస్తే ఎలా తట్టుకుంటుందని అనుకున్నావ్? రాత్రి జరిగిన సంఘటనలతో ఠారెత్తి తల్లిదండ్రుల దగ్గరికి

పారిపోయింది. నీ మూలంగా కాస్త కాఫీ కాసిచ్చే దిక్కులేకుండా పోయింది నాకు..." తల ఎత్తి చూడకుండానే పెద్ద లెక్చర్ యిచ్చాడు డాక్టర్ శర్మ.

చెవులు మూసుకొని మంచంమీద వాలిన షాడో... వరండాలో బూట్ల శబ్దాన్ని పసిగట్టి డాక్టర్ ని హెచ్చరిస్తూ కళ్ళు మూసుకున్నాడు గట్టిగా.

బూట్లు టకటక లాడిస్తూ క్లినిక్ లోకి వచ్చాడు విక్టర్.

"నో... రాజు పొజిషన్ ఏమంత బాగోలేదు. రాత్రంతా ఒకటే జ్వరం. ఇలా డిస్టర్బ్ చేస్తే న్యుమోనియా రావటానికి అవకాశాలున్నాయి." అంటూ అతనికి అడ్డం వెళ్ళాడు డాక్టర్ శర్మ.

"ఐ డోన్ట్ కేర్ యీ వెన్ ఇఫ్ హీ డైస్ విత్ న్యుమోనియా... అంటూ అతన్ని ప్రక్కకు నెట్టి షాడో భుజాన్ని పట్టుకొని గట్టిగా కుదిపాడు విక్టర్.

అప్పుడే నిద్ర లేచినట్లు బద్ధకంగా చూస్తూ, లేచి కూర్చున్నాడు షాడో. కాలును సవరించుకొని రెండుసార్లు అమ్మా, నాయనా అన్న రాగాలు తీసి మంచంమీద సర్దుకు కూర్చున్నాడు.

డల్‌గా వున్నాడు విక్టర్... నిద్రలేనట్లు పీక్కుపోయి వుంది ముఖం.

"వాట్! ది గ్రేట్ రివల్యూషనరీ కారెక్టర్ యీ రోజు యిలా డల్‌గా వున్నారు?" వ్యంగ్యంగా పరామర్శించాడు షాడో.

"రాజూ! నెపోలియన్ కనిపించటంలేదు. మరో యిద్దరు అనుచరులు కూడా మాయమయ్యారు..." బాధగా అన్నాడు విక్టర్.

నిరారుగా కూర్చున్నాడు షాడో... వస్తోంది తుఫాను... ఏ క్షణంలోనైనా మీద పడవచ్చు...

"ఓడనంతా గాలించాము... ఇంకా వెతకవలసిన ప్రదేశాలు చాలా వున్నాయి... బట్ ఐ డోన్ట్ హేవ్ టైం, అవతల ప్రిన్సెస్ వేగం హెచ్చిందట... ముందు నాకు యీ విషయాలు చాలా అవసరం...." అంటూ మాప్స్‌ని షాడో ముందు పరిచాడు విక్టర్.

ఉలికిపాటును కప్పిపుచ్చుకుంటూ వాటిలో తల దూర్చాడు షాడో. తను వూహించినట్లు వెనక్కి తిరగలేదు కావేరి. ముందుకే పోతోంది... తామందరమూ ప్రాణాలు పోగొట్టుకునే క్షణం దగ్గిరికి వచ్చేస్తున్నది

మరునాడు ఉదయం ఐదుగంటలకు ప్రిన్సెస్‌ని క్రాస్ చేస్తుంది కావేరి. ఐదు గంటలు. తూర్పుదిక్కు తెల్లబడుతూ వున్న సమయంలో...

అ ప్రయత్నంగా గోడ గడియారం వైపు చూశాడు షాడో. పదకొండు గంటల పదిహేను నిముషాలు అయ్యింది... మరో ఇరవై తొమ్మిది గంటల నలభై అయిదు నిముషాలు మాత్రమే వుంది వ్యవధి?

మాప్‌లను తీసుకుని వెళ్ళిపోయాడు విక్టర్... ఆలోచనలతో బరువెక్కిన తలను తలగడమీదికి చేర్చాడు షాడో... అనుకోకుండా నిద్రపట్టింది తిరిగి లేచేసరికి ప్రక్కనే ప్రత్యక్షమయింది సీమ.

ఆమె కుడిచేయి షాడో ముఖంమీద పడుతున్న ముంగురులను సవరిస్తు న్నది

"హల్లో! గుడ్ మార్నింగ్!" అని విష్ చేశాడు షాడో.

"రాజూ... ఫాదర్ ఆ జాబ్ సంగతి రిమైండ్ చెయ్యమన్నారు ఏమంటావ్?" అని అడిగింది సీమ.

"ఐయామ్ సారీ సీమా. నేనా జాబ్ చేయలేను."

"ఎందుకని?"

"ఎందుకని అని నిలదీసి అడిగితే ఏం చెప్పను? చాలా కారణాలున్నాయి."

"రాజూ! కనీసం నన్ను చూసైనా ఒప్పుకోవచ్చుగా?" ఇంక అంతకన్నా డైరెక్ట్‌గా ఏ ఆడది చెప్తుంది? నేను నిన్ను ప్రేమిస్తున్నానని షాడో గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. ఏమంటే ఏమి అనుకుంటుందో అని నోరు మూసుకున్నాడు. ఏది ఏమైనా ముందు ప్రాణాలతో బ్రతికి బయటపడితే గదా... ఈ విషయాలను గురించి ఆలోచించగలిగేది?

విక్టర్ కాబిన్‌లో తనువిన్న మాటలు, శవపేటికలో తాము చూసిన బాంబు జ్ఞప్తి కి వచ్చి ఏదో చల్లటి మంచు హస్తం గుండెల్ని పిండేస్తున్నట్లు బాధపడ్డాడు. మరుక్షణం అతనిలోని ఆవేశం రగుల్కొంది. సమాధానం కోసం ఆశగా ఎదురుచూస్తున్న సీమకు నిరాశ ఎదురయింది. విపరీతమైన

ఆలోచనల్లో మునిగిపోయిన షాడోని డిస్టర్బ్ చేయలేక పోయిందామె. చీకటిపడింది. విక్టర్ రెండు సార్లు వచ్చి నావిగేషనల్ పర్టిక్యులర్స్ తెలుసుకుపోయాడు.

పదకొండు గంటలయింది.

లేచి బాండేజీలు వూడతీశాడు షాడో. బయట గార్డు పచార్లు చేస్తున్నాడు

పూర్తి మెలకువతో వున్నాడతను. కాఫీ పథకం ఈ సారి అతని దగ్గరపనిచేసే సూచనలు కనిపించటం లేదు.

మెల్లిగా పోయి తలుపుల్ని గడియపెట్టాడు షాడో.

"వాసూ! కమాన్..." అంటూ అతన్ని బెడ్ మీదినుంచి క్రిందికి దించి, క్లినిక్ ఎడమ గోడకు వున్న కిటికీ మీద కూర్చోపెట్టాడు.

"నువ్వు నీ ప్రాణాల మీదికి తెచ్చుకోవటమే కాక, మిగిలిన వారందరినీ డేంజరస్ పొజిషన్‌లో యిరికిస్తావా?" అంటూ ప్రొటెస్ట్ చేశాడు డాక్టర్ శర్మ.

అతని మాటలు వినిపించుకునేది ఎవరు? చెవిటివాడిలా చూసి షాడోని తన భుజాలమీద ఎక్కించుకొని, కిటికి అంచుల్ని గట్టిగా పట్టుకున్నాడు వాసు. మెల్లిగా పైకి లేచి, ఓడ ప్రక్క భాగంలో

వ్రేలాడుతున్న గొలుసుల్ని అందుకున్నాడు షాడో. బల్లిలా వాటిని అంటి పెట్టుకొని, మెల్లగా డెక్ మీదికి పోయాడు.

లోడింగ్ ఎపార్ట్‌మెంట్స్ దగ్గర అతనికి కనిపించారు విక్టర్ - సైంటిస్ట్ మోర్గాన్ చీకటి మాటున వదిగి నిలబడి వారి మాటల్ని విన్నాడు.

"యస్... మిస్టర్ మోర్గాన్.. రేపు ఏడున్నరకల్లా అది ప్రేలిపోయేటట్లు ఆటోమాటిక్ డివైస్‌ని అరేంజి చేయండి జాగ్రత్త! ఏ మాత్రం పొరపాటు జరిగినా నా కోపాన్ని చవిచూడవలసి వస్తుంది మీరు..." కరుకు కంఠంతో హెచ్చరిస్తున్నాడు విక్టర్.

చిన్నబోయిన ముఖంతో లోడింగ్ ఎపార్ట్‌మెంట్‌లోకి దిగాడు సైంటిస్ట్ మోర్గాన్ నలుగురు దృఢకాయులు అతన్ని అనుసరించారు.

కాబిన్స్ వైపు పోతున్న విక్టర్‌ని అక్కడే ఖతం చేద్దామనే వుద్దేశ్యంతో కత్తిని బయటికి లాగాడు షాడో. అంతలోనే మరో నలుగురు అనుచరులు అటుగా వచ్చారు. వారితో కలిసి కాబిన్స్ వైపు వెళ్ళిపోయాడు విక్టర్.

తరుచుగా చాటుముఖం వేస్తున్న అదృష్ట దేవతను నిందించుకుంటూ లోడింగ్ ఎపార్ట్‌మెంట్ వైపు చూస్తూ కూర్చున్నాడు షాడో.

అరగంట తర్వాత తిరిగి వచ్చాడు మోర్గాన్ అతన్ని అనుసరించిన వారందరూ బయటికి రాగానే మెల్లిగా అటు అడుగులు వేశాడు షాడో.

ఇనుప నిచ్చెన మీదుగా క్రిందికి దిగి శవ పేటికలను సమీపించాడు ఇవతలికి లాగి వున్నాయవి. కొత్తగా మేకులు కొట్టిన బాక్స్‌ని తెరిచి అందులో వున్న బాంబుని జాగ్రత్తగా పరిశీలించాడు.

ఆటోమాటిక్ డివైస్ అలారాం టైంపీస్ మాదిరి టిక్ టిక్ మంటున్నది. ఏడు గంటల ఇరవై తొమ్మిది నిమిషాలకు ప్రేలిపోతుందా బాంబు. ఆ ప్రేలుడుకు పెనం మీద పడిన నీటిబొట్టులా ఆవిరైపోతుంది కావేరి.

కత్తిని స్క్రూడ్రయివర్‌లా వుపయోగించి, బాంబు మీద వున్న ఆటోమేటిక్ సాధనాన్ని వూడతీయటం ప్రారంభించాడు షాడో. డెలికేట్ పని అది. ఏ మాత్రం వత్తిడి తగిలినా... ముఖం మీదే ప్రేలుతుందది.

కళ్ల మీదికి జారుతున్న చెమటల్ని చొక్కా చేతికి తుడుచుకుంటూ, ఒక్కక్షణాన్ని కూడా వృథ చేయకుండా ఆ సాధనాన్ని సగం విడతీశాడు షాడో.

ఉన్నట్లుండి జలదరించింది అతని శరీరం. వెంటనే క్రిందవున్న చెక్కను శవపేటిక మీద పెట్టి పాములా చీకట్లలోకి జరిగాడు.

ఆరుగురు దృఢకాయులు నిచ్చెన మీదినుంచి క్రిందికి దిగారు. టార్చి వెలుగుల్లో శవ పేటికలను చూసి, ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. "తాళ్ళు లేనిదే వీటిని డెక్ మీదికి తీసుకుపోలేం. అందులోను ఆ బాంబు వున్న పెట్టెను మరింత జాగ్రత్తగా ఎత్తాలి" అన్నాడు ఒకడు.

ఒకేసారి వెనుదిరిగారు వారందరూ. తాళ్ళు తీసుకొని రావటానికి మళ్ళీ డెక్ మీదికి పోయారు.

శవపేటిక దగ్గరికి జంప్ చేశాడు షాడో. మూతను క్రిందికి లాగి అందులోని బాంబును చంటి బిడ్డలా చేతుల్లోకిఎత్తుకున్నాడు దాన్ని ఒక మూల వున్న గోనె సంచీల క్రింద దాచి... అక్కడే వున్న పాత యినుప గొలుసుల్ని శవపేటికలో పేర్చాడు. చీకటికి అలవాటు పడిన అతని నేత్రాలు వేగంగా కదిలే అతని చేతులు రెండు నిముషాల్లో చేయవల్సిన పనిని చేసి ముగించాయి.

తాళ్ళను తెచ్చిన దృఢకాయులకు మార్పిడి జరిగిన విషయం అర్ధం కాలేదు.

ఎలా అర్ధం అవుతుంది? బాంబుకు బదులు పేటికలో వున్న యినుప చైన్లు ఆ లోపాన్ని భర్తీ చేస్తున్నాయి

శవపేటికలు డెక్ మీదికి వెళ్ళిన తర్వాత బాంబు వైపు అడుగులు వేయబోయి మధ్యలోనే ఆగిపోయాడు షాడో.

నో... దాన్ని అలాగే వుంచటం మంచిది... పైకిపోయి మరో యాంగిల్ లో ట్రయిల్స్ వేయటం బాగుంటుంది.

గబగబా పైకి వచ్చి రేడియో రూమ్ ని సమీపించాడు. లాక్ చేసి వున్నది. ఆ ధీమా మూలకంగా కాబోలు గార్డులు లేరు ఆ పరిసరాలలో, కత్తి మొనను తాళంలో దూర్చి అటు యిటూ కదిలించాడు. రెండు క్షణాలలో వూడి క్రిందపడింది తాళంకప్ప.

నిశబ్దంగా లోపలికి పోయి.. లోపలి వైపు బోల్టును బిగించాడు. వైర్‌లెస్ సెట్‌ని యాక్టివేట్ చేసి...

"త్రిపుల్ సిక్స్ కాలింగ్... రెడ్ స్టార్... ప్లీజ్ కమిన్..." అంటూ పంపించాడు ఒక మెస్సేజ్‌ని.

ఐదు క్షణాలలో వచ్చింది రిప్లయి. పసిపిక్ మాహాసముద్రంలో తిరుగుతున్న సోవియట్ ఎయిర్ క్రాఫ్ట్ కారియర్ ఉజ్జెక్ లైన్ మీదికి వచ్చింది.

నాలుగు వాక్యాల్లో వారికి చేయవలసిన పనిని గురించి చెప్పాడు షాడో... కులకర్ణిగారి హెచ్చరికల్ని లెక్కచేయకుండా.

"సర్... మేము ఎంత వేగంగా వచ్చినా మిమ్మల్ని సమయానికి కలుసుకోలేము. బాంబర్ విమానాన్ని పంపించమంటారా!" ఆందోళనగా అడిగాడు ఉజ్జెక్ కాప్టన్.

"నో థేంక్స్. ఏ మాత్రం అనుమానం వచ్చినా ప్రయాణీకులనందర్ని చంపి సముద్రంలో పడేస్తారు. లెట్ మీ హేండిల్ ది ధింగ్స్. మీరు నేను చెప్పినట్లు చేయండి... అన్నాడు షాడో.

"ఓ.కే. సర్... ఐదు నిముషాల్లో చేయిస్తాను" అంటున్న అతని మాటలు వినిపించుకోకుండా సర్క్యూట్ని క్లోజ్ చేశాడు. తలుపులు తెరిచి బయటికి తొంగి చూశాడు. ఎవరూ గమనించటం లేదని నిశ్చయ పరుచుకోగానే బయటికి వచ్చి , క్రిందవున్న తాళం తిరిగి బిగించాడు.

విక్టర్ యీ సరికి తన కోసం విచారిస్తూ వుండవచ్చు. ఇక గదికి పోవటమంత మంచి పని మరొకటి లేదని అనుకుంటూ డెక్ చివరికి పోయి యినుప గొలుసుల మీదుగా క్రిందికి జారాడు.

కిటికి ప్రక్కనే వున్నాడు వాసు. వెంటనే చేతుల్ని అందించి షాడోని లోపలికి లాక్కున్నాడు.

అతన్ని మంచం మీదికి పంపి తన బాండేజీలను తిరిగి కట్టుకున్నాడు. చెక్కల్ని బిగించుకొని తలుపుల్ని తెరిచి వుంచమని డాక్టర్ని హెచ్చరిస్తూండగారానే వచ్చాడు విక్టర్.

తలగడమీద వాలి కళ్ళు మూసుకున్నాడు షాడో. గడియ తీసి గోడ మీది పటాల్ని అతి దీక్షగా చూడటం ప్రారంభించాడు డాక్టర్ శర్మ.

షాడో భుజంమీద దబదబా కొట్టి నిద్ర లేపాడు విక్టర్. "రాజూ ఐ డోన్ట్ హేవ్ మచ్ టైం ఇదీ నా పొజిషన్. నేను ప్రిన్సెస్‌ని నాలుగు గంటలకే క్రాస్ చేయ్యాలి. ఎంత వేగంతో పోవాలి? చెప్పు..." అన్నాడు ఆదరా బాదరాగా నిద్రముఖంతో డీటైల్స్ వర్క్ చేశాడు షాడో.

ఒకరొకరే లేచి కూర్చోవటం మొదలుపెట్టారు డాక్టర్ శర్మ. సీములు క్లినిక్ ద్వారం దగ్గర నిలబడ్డారు వాసు మంచం మీద కూర్చున్నాడు. ఆఖరికి కొంచెం కోలుకున్న కాప్టెన్‌టోనీ కూడా అప్పుడే కళ్ళు తెరిచాడు.

"ప్రిన్సెస్‌ని ఎలా ఆపుదామని నీ ఉద్దేశ్యం" అడిగాడు షాడో, విక్టర్ వైపు చూస్తూ.

"గన్స్ తెచ్చాం, నువ్వు చూడలేదా? వాటిని చూపి బెదిరిస్తాం" సమాధానం యిచ్చాడు విక్టర్.

"అమాయకుడా!" అన్నట్లు పెదవి విరిచాడు షాడో. "చూడు విక్టర్, ప్రిన్సెస్ వేగం కావేరికంటే రెండు రెట్లు అధికం. నువ్వు గన్స్ గిన్స్ చూపించావంటే అది వెనుతిరిగి పారిపోతుందనుకో? అప్పుడేం చేస్తావ్?" అని అడిగాడు.

"నో, నో... అలా జరగదు. అందుకే చీకటి వుండగానే సమీపంలోకి పోతాం."

"సప్పోజ్ చీకటిలో ఒక గుర్తు తెలియని ఓడ నిన్ను సమీపిస్తున్నదని నీ రాడార్ చెప్తుందనుకో! నువ్వేం చేస్తావ్?" అడిగాడు షాడో.

ఆలోచనలో పడ్డాడు విక్టర్. అతనికీ ఐడియా రాలేదు."రాజూ... నువ్వే చెప్పు." అన్నాడు ఆఖరికి.

గొంతు సవరించుకున్నాడు షాడో.

"రాజూ!" ఖంగుమంటూ వినిపించాల్సిన కాప్టెన్ టోనీ గొంతు బొంగురుగా వినిపించింది.

"రాజూ... ఏవో నావిగేషన్ వివరాలు చెప్పటం... ఆత్మరక్షణ చేసుకోవటం యివి సామాన్యమైన విషయాలు. కానీ దొంగలకు పథకాలు చెప్పి వారికి సాయపడటం నేరం. క్రిమినల్ ఆఫెన్స్. యు షట్ యువర్ మౌత్" అన్నాడు.

"సారీ కాప్టెన్.. మనం ఎంత త్వరగా బయటపడితే అంతమంచిది. అందుకే వీరిపని త్వరగా అయ్యే మార్గం చెపుతున్నాను" సమాధానం యిచ్చాడు షాడో.

"నో, నో... ఈ నౌక కాప్టెన్‌గా నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను నోరు మూసుకో." కోపంతో మండిపడుతూ అరిచాడు కాప్టెన్ టోనీ.

ఆ మాటలను పట్టించుకోనట్లు విక్టర్‌కి చేయవలసిన పనిని గురించి బోధించాడు షాడో. "ఏ నౌక అయినా గుర్తు తెలియని పరాయి నౌక దగ్గరగా వస్తున్నదంటే పారిపోవటానికో, పోరాడటానికో సిద్ధంగా వుంటుంది. అందువల్ల నువ్వు ముందు డిస్ట్రెస్ సిగ్నల్స్ కొట్టు. ఇంజన్స్ పాడైపోయాయనో అడుగున చిల్లులు పడ్డాయనో చెప్పు. ప్రయాణీకులను ఆ నౌకలోకి మార్చుకోమని రిక్వెస్ట్ చేయి. ఆ రిక్వెస్ట్‌ని ఎవరూ కాదనకూడదు, అందువల్ల దగ్గరగా పోవచ్చు. దగ్గరికి పోగానే టార్పాలిన్స్ కప్పిన గన్స్‌ని బయటికి లాగి బెదిరించు."

"వండ్రఫుల్... మార్వలెస్... రాజూ... ఇంత జీనియస్‌వి యీ వెధవ ఉద్యోగంలో ఎందుకు మగ్గిపోతావ్? నాతో రా నిన్ను కోటీశ్వరుణ్ని చేస్తాను" ఆనందంగా ఆశగా అడిగాడు విక్టర్.

"నాకేమీ వద్దు, నన్ను క్షేమంగా ప్రిన్సెస్‌లో ఎక్కించు అంతే చాలు" అన్నాడు షాడో.

"ష్యూర్ రాజూ... ష్యూర్.. అలాగే" అంటూ వెళ్ళిపోయాడు విక్టర్.

"యూ బ్లడీ యిడియట్... బ్లడీ డబుల్ క్రాసర్. నీ లాంటి నీచుడు నా కింద పనిచేశాడని తలుచుకుంటుంటే నాకే సిగ్గు వేస్తోంది రాజూ.

యూవ్వార్ ఫినిష్డ్. యువ్వార్ డిస్మిస్డ్. నేలమీద కాలు పెట్టిన మరుక్షణం నిన్ను జైలు చువ్వలా వెనక్కు పంపుతాను చూడు. యూ డర్టీ బాస్టర్డ్" ఆయాసం వచ్చినా ఆగకుండా అడ్డమైన తిట్లూ ప్రయోగించటం ప్రారంభించాడు కాప్టెన్ టోనీ.

"రాజు... నీ మాటలు విని ఏమో అనుకున్నాను. ఇంత నికృష్టుడవని అనుకోనేలేదు. చీ...చీ... వెధవ ప్రాణాలు కాపాడుకోవటానికి యిటువంటి ద్రోహాలు చేస్తావా... ఐ హేట్ యూ, " అంటూ వెళ్ళిపోయింది సీమ.

"నో! రాజు... నువ్వీ పని చేశావంటే నాకు నమ్మకం కలగటం లేదు.. నేను నీ గురించి వేసుకున్న అంచనాలన్నీ తారుమారు చేశావ్..." అంటూ క్లినిక్‌లోకి వెళ్ళిపోయాడు డాక్టర్ శర్మ.

వాసూ కూడా వీపు చూపించాడు. చూపించే ముందు చిన్నగా కన్నుగీటి మరీ చూపించాడు.

***

ప్రిన్సెస్ లొంగిపోయింది. షాడో చెప్పిన పథకాన్ని అక్షరాల ఆచరణలో పెట్టాడు విక్టర్.

తన నౌక అడుగు భాగంలో చిల్లులు పడ్డాయని ప్రయాణీకులను ప్రిన్సెస్ మీదికి చేర్చుకోవాల్సిందనీ ప్రమాదాన్ని సూచించే సిగ్నల్స్ పంపాడు.

వెంటనే హెల్ప్ చేయటానికి వచ్చింది ప్రిన్సెస్. కావేరి ప్రక్కన నిలబడింది. మరుక్షణం టార్పాలిన్ లు కప్పివున్న గన్స్‌ని బయటికి చూపించి, ఆ నౌక కాప్టెన్‌కి హెచ్చరికలు అందచేశాడు విక్టర్.

ఒకరొకరుగా కావేరి ప్రయాణీకులందరూ ప్రిన్సెస్ మీదికి తరలించబడ్డారు కావేరి స్టాఫ్ అంతా వరుసల్లో పోయి ప్రిన్సెస్ డెక్ మీద నిలబడ్డారు అందరికంటె ఆఖర్న కాప్టెన్ టోనీ, వాసు, డాక్టర్ శర్మ, షాడోలు ప్రిన్సెస్ మీదికి తీసుకుపోబడ్డారు

మెషీన్ గన్స్ పట్టుకున్న అనుచరులు ప్రిన్సెస్ కాప్టెన్‌ని, అతని సిబ్బందిని కదలకుండా కవర్ చేస్తున్నారు కావేరి మీదవున్న క్రేన్ దడదడ శబ్దం చేస్తూ ప్రిన్సెస్ డెక్ మీదవున్న ఎరుపు రంగు పెట్టెల్ని కావేరి మీదికి చేరుస్తున్నది

కాప్టెన్ టోనీ పడుకొని వున్న స్ట్రెచ్చర్‌ని సమీపించి సగౌరవంగా షేక్ హేండ్ యిచ్చాడు ప్రిన్సెస్ కాప్టెన్

"కాప్టెన్ టోనీ! చాలా విచారించదగ్గ విషయం యిది. రియల్లీ మిమ్మల్ని యీ పొజిషన్‌లో చూడటం నాకెంతో బాధను కలిగిస్తున్నది!" అంటూ మరో స్ట్రెచ్చర్‌మీద వున్న షాడో వైపు తిరిగి విష్ చేశాడు.

"కాప్టన్! అతన్ని పలకరించకండి. మా నౌకకు యీ గతి పట్టటానికి కారకుడతను. డబుల్ క్రాసింగ్ బాస్టర్డ్... ఈ ట్రబుల్ మేకర్స్‌కి సాయం

చేసి, నేరస్తుడయ్యాడు. ఐయామ్ గోయింగ్ టు సెండ్ హిమ్ టు ప్రిజన్." అని అరిచాడు కాప్టెన్ టోనీ.

ఆశ్చర్యంగా చూశారు అక్కడి వారందరూ...

తల వంచుకొని క్రీగంట సీమ వైపు చూశాడు షాడో. అసహ్యంగా నొసలు చిట్లించిముఖం పక్కకు తిప్పుకున్నదామె.

కావేరి మీద ప్రయాణీకుల సామానంతా ప్రిన్సెస్ మీదికి చేర్చబడింది. ప్రిన్సెస్ మీద వున్న ఆఖరి ఎర్ర పెట్టె కావేరి డెక్ మీదికి ఎక్కింది.

కళకళలాడుతున్న ముఖంతో షాడోని సమీపించాడు విక్టర్. "థాంక్యూ వెరీమచ్ రాజు! నా ఆఫర్ గుర్తుందా? నాతో చేరితే నిన్ను కోటీశ్వరుణ్ని చేస్తాను" అన్నాడు.

"నో. థేంక్స్..." తల అడ్డంగా తిప్పాడు షాడో.

ఒకరొకరుగా కావేరి మీదికి వెళ్ళిపోయారు విక్టర్ అనుచరులు. కావేరి యింజన్లు రైజ్ అవబోతుండగా దాని డెక్ మీదవున్న నాలుగు శవపేటికలు ప్రిన్సెస్ మీదికి వచ్చాయి.

శవపేటికలను చూసిన మరుక్షణం పెద్దగా అరవబోయింది సీమ. చటుక్కున ప్రక్కకు దొర్లి ఆమె కాలిని పట్టుకున్నాడు షాడో.

"షటప్ యూ బ్లడీఫూల్... కీప్ క్వయిట్." అని గద్గించాడు కరకరలాడుతున్న కంఠంతో.

బిత్తరపోయిన సీమ.... రాతిబొమ్మలా నిలబడింది.

ఏడు గంటలు సూచిస్తోంది ఆమె చేతి గడియారం. కావేరి కదిలి మెల్లిగా స్పీడ్ పికప్ చేసింది.

"కాప్టెన్.. ప్రిన్సెస్‌ని కదలించండి... మనం కావేరికి దూరంగా వెళ్ళిపోవాలి... మాగ్జిమమ్ స్పీడ్..." ప్రిన్సెస్ కాప్టెన్ వైపు తిరుగుతూ హెచ్చరించాడు షాడో.

"... షటప్ రాజు! నీ సలహాలు యిక్కడ ఎవరికీ అవసరంలేదు..." కోపంతో గట్టిగా అరిచాడు కాప్టెన్‌టోనీ.

పళ్ళు కొరుకుతూ అతని వైపు తిరిగాడు షాడో. "కాప్టన్ దయచేసి ముందు మీరు నోరు మూసుకోండి నోరు తెరిస్తే మాత్రం బాగోదు..." అంటూ ప్రిన్సెస్ కాప్టన్ వైపు తిరిగాడు షాడో.

"కాప్టన్ దయచేసి ప్రిన్సెస్ ని కదలించండి... ప్లీజ్.." అని రిక్వెస్ట్ చేశాడు.

అతని మాటలు ఎందుకూ కొరకాకుండా పోయాయి. ఎవరూ వినిపించుకోలేదు.

"వాసూ!" అని గర్జించాడు.

మెరుపులా లేచాడు వాసు. దెబ్బతిన్న కాలును లక్ష్యపెట్టకుండా ఒక్క గంతులో పోయి ప్రిన్సెస్ కాప్టెన్‌ని క్రిందపడవేసి అతని రివాల్వర్‌ని షాడో వైపు విసిరేశాడు.

దాని బారెల్ని ప్రిన్సెస్ స్టాఫ్ వైపు గురిపెట్టాడు షాడో. "మర్యాదగా ప్రిన్సెస్ ని కదిలించండి... డూ యిట్ ఎట్ వన్స్... నేను చెప్పినట్లు చేయకపోతే మీ కాప్టన్ ప్రాణాలు దక్కవ్..."

ఖంగారుగా యింజన్ రూమ్ లోకి పరుగుతీశారు వారందరూ. క్షణాల మీద కదిలింది ప్రిన్సెస్... నిముషంలో స్పీడ్ ని పికప్ చేసింది.

సీమ రిస్ట్ వాచి ఏడుగంటల ఇరవై తొమ్మిది నిముషాలు సూచిస్తుండగా.. చెవులు చిల్లులుపడే శబ్దం కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతులు కానవచ్చాయి.

దూరంలో ఎక్కడో వున్న కావేరి తునాతునకలై గాలిలోకి ఎగిరిపోయింది. అరమైలు ఎత్తుకు లేచింది సముద్రపు నీరు... పెద్ద కెరటం ఒకటి కంటికి కనిపించలేనంత వేగంతో వచ్చి ప్రిన్సెస్‌ని ఎత్తి నాలుగు మైళ్ళ దూరం విసిరేసింది. భరించరాని వేడిమి వాతావరణం నిండా అలుముకుంది. ఆకాశం రక్తంతో తడిసినట్లు ఎర్రబడి పోయింది.

కావేరితోపాటు ఆవిరైపోయారు విక్టర్ అతని అనుచరులు. ఆటంబాంబును తస్కరించిన ద్రోహి మోర్గాన్‌కూడా అదే గతిని పొందాడు.

ఆశ్చర్యంతో తమ కళ్ళను తామే నమ్మలేక విచిత్రంగా చూశారు ప్రిన్సెస్ మీదవున్న వారందరూ.

ప్రిన్సెస్ కాప్టన్ గుండెలకేసి గురిపెట్టిన రివాల్వర్‌ని అవతలికి విసిరి స్ట్రెచ్చర్‌మీద వాలిపోయాడు షాడో.

"రాజూ! ఆ బాంబు శవపేటికలో వుండాలి కదూ" ఆశ్చర్యంగా అడిగింది సీమ.

చిరునవ్వు నవ్వి వాసు వంక చూశాడు షాడో. అతను శవపేటికను పగలగొట్టి అందులోని యినుప చైన్లను వారందరికీ చూపించాడు.

క్షణంలో అర్థం అయింది అందరికీ. షాడో ప్రిన్సెస్‌ని కదిలించమని అంత వత్తిడి ఎందుకు చేశాడో. శవపేటికలో బాంబు వున్నదని భ్రమపడి వాటిని ప్రిన్సెస్ మీదికి చేర్చిన విక్టర్ పెద్ద పొరపాటు చేశాడు.

గుండెల్ని సవరించుకుంటూ లేచి వాసు గడ్డం క్రింద గుద్దాడు ప్రిన్సెస్ కాప్టన్.

"మీరు ఎంత తెలివిగా ప్రవర్తించినా నా నౌకకు సంబంధించినంత వరకూ మీరు ద్రోహులే. ఆస్ట్రేలియా నుంచి ఐదు వేల కోట్ల రూపాయల బంగారాన్ని వరల్డ్ బాంక్‌కి తీసుకుపోతున్నాను నేను. కావేరి మీది దొంగలు ఆ బంగారాన్ని దొంగిలించారు. ఇప్పుడా బంగారం కూడా కావేరితోపాటు భస్మమైపోయింది." అన్నాడు షాడో వైపు కోపంగా చూస్తూ.

"నేను ముందే చెప్పాను. అరెస్ట్ దట్ స్కౌండ్రల్..." గీరపడిన గొంతుతో అన్నాడు కాప్టెన్‌టోనీ.

"కాప్టన్... గత రాత్రి మీకు ఆస్ట్రేలియానుంచి ఒక కేబిల్ వచ్చింది కదూ?" అడిగాడు షాడో. టోనీ అరుపుల్ని లక్ష్యపెట్టకుండా.

ఆశ్చర్యంగా తలవూపాడు ప్రిన్సెస్ కాప్టెన్

"బంగారం మెడిసిన్స్ అని వ్రాయబడిన పెట్టెల్లో పాక్ చేయబడింది కదూ?" అడిగాడు షాడో.

"యస్ కాని రాత్రి వచ్చిన మెస్సేజిలో..."

"ఆ మాట యదార్థం కాదని వుంది. పొరపాటున అలా చెప్పటం జరిగింది. బంగారం నిజానికి ఎక్స్‌ప్లోజివ్స్ అని వ్రాయబడి వున్న ఎర్రపెట్టెల్లో వుంది జాగ్రత్త అని హెచ్చరించారు మీ అధికారులు." అంటూ ఆ మాటను పూర్తిచేశాడు షాడో.

"యువర్ కరెక్ట్. కాని నా స్టాఫ్ లోనే డబుల్ క్రాసర్స్ వున్నారని నాకు యిప్పుడు అర్థం అవుతున్నది. కేబిల్ రాగానే ఆ విషయాన్ని విక్టర్‌కి చేరవేశారు. ఆ దుర్మార్గుడు ఆ ఎర్రపెట్టెల్నే ఎత్తుకుపోయాడు" విచారంగా అన్నాడు ప్రిన్సెస్ కాప్టెన్

"నో... సర్. మీరు పోయి చూసుకోండి... మీ బంగారం మీ దగ్గరే వుంది" అంటూ నవ్వాడు షాడో.

ఆ మాటలతో జీవం వచ్చింది ప్రిన్సెస్ కాప్టన్‌లో. మెడిసిన్స్ అన్న బాక్స్ పగలగొట్టి చూశాడు. తళతళా మెరుస్తు న్న బంగారపు కణికలు బయటపడ్డా యి

"విక్టర్ మాటలద్వారా యిటువంటి పనే ఏదో జరుగుతున్న దన్న అనుమానం నాకు కలిగింది. ప్రిన్సెస్‌ని ఆపటం అతను ప్రయాణీకుల్ని సురక్షితంగా అవతలికి చేర్చటానికి కాదని తెలిసిన మరుక్షణం నేనే ఎదురెత్తు వేశాను. సోవియట్ నౌక ఉజ్జెక్‌కి మెస్సేజి పంపి యీ విషయాన్ని మీ ప్రభుత్వానికి తెలియచేయమని రిక్వెస్ట్ చేశాను. వాళ్ళ కబురు అందగానే యీ తప్పు మెస్సేజిని రిలే చేసింది ఆస్ట్రేలియన్ ప్రభుత్వం. ప్రిన్సెస్ రేడియో ఆపరేటర్లు విక్టర్ అనుచరులు. వెంటనే వాళ్ళు బంగారపు పెట్టెల్లో తారుమారు జరిగిందని విక్టర్‌కి చేరవేశారు... " అంటూ అన్ని విషయాలను వివరించాడు షాడో.

అతని మాటలకు ఆధారంగా దూరంలో కనిపించింది సోవియట్ ఎయిర్ క్రాఫ్ట్ కారియర్ ఉజ్జెక్ దాని బాంబర్ విమానాలు కొన్ని గద్దల్లా ఎగురుతూ వచ్చి ప్రిన్సెస్ డెక్ మీదవున్న షాడోని వుద్దేశించి గౌరవ వందనం చేశాయి. ఆ విషయం ప్రిన్సెస్ మీది వారెవ్వరికీ అర్థంకాలేదు. కాదు కూడా.

శాల్యూట్ చేయాలో, వచ్చి కౌగిలించుకొని కృతజ్ఞతలు తెలియ చేసుకోవాలో అర్థంకాక తికమక పడసాగాడు ప్రిన్సెస్ కాప్టెన్

"ఐయామ్ సారి" అంటూ క్రిందవున్న వాసును లేపి నిలబెడుతుండగా కాప్టెన్‌టోని వైపు చూసింది సీమ.

"మిస్టర్ టోనీ! మనం రాజును అపార్థం చేసుకున్నాం క్షమాపణ కోరుకోవటం మన విధి..." అన్నది. గుర్రుమన్నాడు కాప్టన్ టోని.

"అవునమ్మా నిజమే. రాజును నేను అపార్థం చేసుకున్నాను. దుర్మార్గుడు క్షణంలో పెద్ద హీరో అయిపోయాడు. కాని నన్ను... తన కాప్టన్ అనే భయం లేకుండా నోరు మూసుకోమన్నాడు. అది మాత్రం క్షమార్హం కాదు. డిసిప్లిన్‌కి విరుద్ధమైన చర్య" అన్నాడు.

"మీదేముంది సార్! మీరు అతనికి పై అధికారి మాత్రమే. నన్ను కూడా షటప్ అన్నాడు. అది చాలదన్నట్లు బ్లడీ ఫూల్ అన్నాడు. కాబోయే భార్యను అలా అనటం మర్యాదా?" అడిగింది సీమ.

అదిరిపడి వెర్రిగా చూసాడు షాడో "కాబోయే భార్యా? ఎవరు, ఎవరికి?" అన్నాడు అయోమయంగా.


"నీకూ నాకూ వచ్చే నెలలో మ్యారేజి మిస్టర్! ఫాదర్ యాక్సెప్ట్ చేసారు. వివాహం అవగానే నువ్వు యీ పాడు వుద్యోగానికి రిజైన్!..."

లేచి నిలబడడానికి ప్రయత్నించాడు షాడో. ఓపిక చాలలేదు. "నాకు... నాకు ఆల్ రెడీ మ్యారేజ్ అయ్యింది" అన్నాడు జయరాం ప్రసాద్ వైపు చూస్తూ.

కరెంట్ షాక్ కొట్టినట్లు వులిక్కిపడింది సీమ. క్షణంలో తేరుకుంది. "ఐ డోన్ట్ కేర్... రెండవ మ్యారేజి చేసుకో... ఐ డోన్ట్ మైండ్" అన్నది మరింత పట్టుదలగా.

ఆటంబాంబుని కావేరి మీద పెట్టటం పెద్ద పొరపాటు అయిందని గ్రహించాడు షాడో... ప్రిన్సెస్ మీద పెట్టి వుంటే!!!

జైహింద్


Trouble
Makers
MADHU BABU